

▼ రాళ్లు తేలిన బ్రాంచ్ కెనాల్ ▼



కాలువలు శిథిలం

- మరమ్మతులు చేయక ఎనిమిదేళ్లు
- సాగునీటి కమిటీల ఏర్పాటుతో ఆశలు
- నిధులు ఇవ్వాలని ప్రభుత్వానికి రైతుల వినతి

అధ్వానంగా హెచ్చెల్సీ డిస్ట్రిబ్యూటరీలు

హెచ్చెల్సీ డిస్ట్రిబ్యూటరీ కాలువలు దెబ్బతిన డంతో ఆయకట్టు రైతులు కొన్నేళ్లుగా నష్ట పోతున్నారు. పొలాలకు నీటిని తీసుకెళ్లే ప్రధాన కాలువలు ఎనిమిదేళ్లుగా మరమ్మతులకు నోచుకో లేదు. శిథిలావస్థకు చేరుకున్న కాలువలను బాగుచేయకపోతే నీరు వచ్చినా వృథా అవుతుం దని రైతులు వాపోతు న్నారు. హెచ్చెల్సీ సబ్ డివి జన్ పరిధిలోని కణేకల్లు, బొమ్మనహాళ్ మండలా లలో ఆయకట్టు కింద ఉన్న డిస్ట్రిబ్యూటరీలు బాగా దెబ్బతిన్నాయి. ఇన్నాళ్లూ సాగునీటి సంఘాలు లేకపోవ డంతో రైతులకు ఎవరిని అడగాలో తెలియలేదు. అధికారులూ పట్టించు కోలేదు. తాజాగా సాగు నీటి సంఘాలు ఏర్పాట య్యాయి. అధ్యక్షులు బాధ్యత వహించి.. నీటి తరలింపు కాలువల మరమ్మతుకు కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, కణేకల్లు



నిధుల లేమి

డిస్ట్రిబ్యూటరీల మరమ్మతులకు 2016 వరకు ఉన్న ప్రభుత్వాలు నిధులు మంజూరు చేశాయి. సాగునీటి సంఘాల కమిటీల ఆధ్వర్యంలో మర మ్మతులు చేపట్టాయి. కొన్ని చోట్ల ఆధునికీకరణలో బాగంగా మరమ్మ తులు చేశారు. 2016 తరువాత నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించలేదు. దీంతో డిస్ట్రిబ్యూటరీల మరమ్మతులు ఎక్కడ వేసిన గొంగళి అన్న చందంగా తయారైంది. కమిటీలు లేకపోవడంతో నిధుల గురించి అడిగేవారే లేకుండాపో యారు.

ఇప్పుడైనా బాగుపడేనా..?

రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించింది. ప్రతి డిస్ట్రిబ్యూ టరీ కమిటీకి కొత్త అధ్యక్షులు, కమిటీ సభ్యులు వచ్చారు. కణేకల్లు సబ్ డివిజన్ పరిధిలో 11 మంది నీటి సంఘం అధ్యక్షు లుగా ఎన్నికయ్యారు. వీరి ద్వారానైనా పరి స్థితి మెరుగుపడుతుందని రైతులు ఆశిస్తు న్నారు. డిస్ట్రిబ్యూటరీల మరమ్మతుల కోసం ఎదురు చూస్తున్నారు. డిస్ట్రిబ్యూటరీలకు కొత్త గేట్లను అమర్చడం, కాలువ లైనింగ్, ట్రాక్ ఏర్పాటు, ముళ్ల పొదలు, పూడిక తొలగింపు తదితర పనులు చేపట్టాల్సి ఉంది.



వెంటనే మరమ్మతు చేసేవారు..

గతంలో నీటి సంఘాల కమిటీలు వెంట వెంటనే డిస్ట్రిబ్యూటరీ కాలు వలో మరమ్మతులు చేయించేవి. ఎనిమిదేళ్లగా మరమ్మతు పనులు నిలిచిపోయాయి. పొలాలకు సక్ర మంగా నీరు అందడంలేదు. ఇప్పటి ప్రభుత్వం, నీటి సంఘాల కమిటీలు హెచ్చెల్సీ డిస్ట్రిబ్యూటరీ లపై ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది.

- మల్లికార్జున, రైతు, కణేకల్లు

ప్రతిపాదనలు పంపుతాం..

రాష్ట్ర ప్రభుత్వం హెచ్చెల్సీ ప్రధాన కాలువ మరమ్మతుల కోసం రూ.36 కోట్లు మంజూ రు చేసింది. డిస్ట్రిబ్యూటరీల మర మ్మతుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించింది. హెచ్చెల్సీ సబ్‌డివిజన్ పరిధి లోని అన్ని డిస్ట్రిబ్యూటరీలను క్షణ్ణంగా పరిశీ లించి, ప్రతిపాద నలు పంపు తాం.



- మద్దిలేటి, హెచ్చెల్సీ డీఈ



మొరాయిస్తున్న షట్టర్లు

హెచ్చెల్సీ సబ్ డివిజన్ పరిధిలో మొత్తం 14 డిస్ట్రిబ్యూటరీలు ఉన్నాయి. వీటిలో చాలా డిస్ట్రిబ్యూటరీల షట్టర్లు మొరాయిస్తున్నాయి. ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోలేదు. కొన్నిచోట్ల ముళ్ల పొదలు పెరిగాయి. సైడ్‌వాల్స్ రాళ్లు తేలి, నీటి సర ఫరాకు ఆటంకంగా మారాయి. 14 డిస్ట్రిబ్యూటరీల పరిధిలో మొత్తం 36,500 ఎక రాల ఆయకట్టు ఉంది. ప్రతిరోజూ 300 క్యూసెక్కుల నీరు డిస్ట్రిబ్యూటరీల ద్వారా పొలాలలోకి చేరుకోవాల్సి ఉంది. కానీ అవి దెబ్బతిన్న మరమ్మ తుల కారణంగా 50 క్యూసెక్కుల నీరు వృథా అవుతోంది.



సొంత డబ్బుతో మరమ్మతులు..

డిస్ట్రిబ్యూటరీల పరిధిలోని రైతులు ప్రతి ఏటా సొంత డబ్బుతో కాలువ లకు మరమ్మతులు చేసుకుంటున్నాం. నీరు విడుదల కాక ముందే చందాలు వేసుకుని కాలువలను బాగుచేసుకుం టున్నాం. లేకపోతే మాగాణి భూము ల్లోకి నీరు రాదు. ఇప్పుడైనా డిస్ట్రిబ్యూట రీల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి.

- తిప్పేస్వామి, రైతు, మారెంపల్లి

ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాం..

చిక్కణ్ణేశ్వర చెరువు కింద దాదాపు ఐదు డిస్ట్రిబ్యూటరీలు ఉన్నాయి. వీటిలో కొన్ని చోట్ల ముళ్ల పొదలు పెరిగాయి. మరికొన్ని చోట్ల షట్టర్లు శిథి లావస్థకు చేరాయి. ఎనిమిదో డిస్ట్రిబ్యూటరీ కూడా చెరువు కిందకే వస్తుంది. అది కూడా ఇబ్బందికరం గానే ఉంది. అన్ని విషయాలను ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకెళతాం. సమస్య పరిష్కారానికి కృషిచేస్తాం.



- బీటీ రమేష్, చెరువు సంఘం అధ్యక్షుడు, కణేకల్లు

మరమ్మతులకు కృషి చేస్తాం..

డిస్ట్రిబ్యూటరీల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తాం. పూడిక పేరుకుపోవడంతో నీటి సరఫరా సక్రమంగా జరుగడంలేదు. చివరి ఆయకట్టు రైతులు ఇబ్బంది పడుతు న్నారు. కాలువ గట్లపైన సరైన ట్రాక్ లేదు. ముళ్ల పొదలు పెరిగాయి. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైతే అన్ని సమస్యలను పరి ష్కరిస్తాం.



- దేవేంద్ర, 7వ డిస్ట్రిబ్యూటరీ అధ్యక్షుడు

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్



పీఆర్ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల

అనంతపురం డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఉరవకొండ నియోజకవర్గంలో అభి వృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశిం చారు. నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో శనివారం రాత్రి సమీక్షా సమావేశం సమీక్షించారు. ఐదు మండలాల పరిధిలో ఆర్అండ్‌బీ రహదారులపై గుంతలు లేకుండా చూడాలని ఆదేశించారు. గ్రామాలలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వల నిర్మాణం గురించి పీఆర్ అధికారులతో చర్చించారు. లక్ష్యానికి అనుగుణంగా పనులు చేపట్టాలని సూచిం చారు. జనవరి ఆఖరులోగా సీసీ రోడ్లు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావే శంలో పీఆర్ ఎస్ఈ జహీర్ అస్లాం, ఆర్అండ్‌బీ ఎస్ఈ రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యం

ప్రభుత్వ విప్ కాలవ



బీటీ ప్రాజెక్టులోకి చేప పిల్లలను వదులుతున్న ఎంపీ అంబికా, ప్రభుత్వ విప్ కాలవ, ఎమ్మెల్యే అమిలినేని

గుమ్మఘట్ట/బ్రహ్మసముద్రం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): బీటీ ప్రాజెక్టు పరిధిలో మత్స్యకారుల సంక్షే మమే లక్ష్యమని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. రిజర్వాయర్‌లో ప్రభుత్వం సబ్సిడీతో అందించిన 6.48 లక్షల చేపపిల్లలను శనివారం వదిలారు. ఎంపీ అంబికా లక్ష్మీనారా యణ, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, ఆర్డీఓ వసంతబాబు, మత్స్యశాఖ అధికారులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మత్స్యకారులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. అనం తరం గుమ్మఘట్ట మండల పరిధిలోని బీటీ ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలకు సాగునీటిని విడుదల చేశారు. ఎడమ కాలువ పరిధిలో 15వ డిస్ట్రిబ్యూటరీ నుంచి చివరి ఆయకట్టు వరకు 2500 ఎకరాలకు, కుడి కాలువ పరిధిలో ఒకటో డిస్ట్రిబ్యూటరీ నుంచి ఆరో డిస్ట్రిబ్యూటరీ వరకు 1725 ఎకరాలకు సాగునీటిని అందించాలని ఆయకట్టు రైతుల సమావేశంలో ఇరిగేషన్ అధికారులు నిర్ణయిం చారు. అందుకు అనుగుణంగా కాలువలకు సాగునీటిని విడుదల చేశారు.

పరిహారం అందించాకే పనులు: అమిలినేని

బీటీపీ కాలువ పనులకు భూములు ఇచ్చిన రైతులకు పరిహారం అందించిన తర్వాతనే కాలువ పనులు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. ఆయకట్టు రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఉద్యాన పంటల సాగు ఎక్కువగా ఉందని అన్నారు. ఇలాంటి ప్రాంతానికి సాగునీరు అందిస్తే రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. బీటీపీ కాలువ పనులు పూర్తి చేసి కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని 114 చెరు వులకు నీరు అందిస్తామని హామీ ఇచ్చారు. వైసీపీ పాలనలో జగన్‌రెడ్డి ఈ ప్రాంతం వైపు కన్నెత్తి చూడలేదని విమర్శించారు. కరెంటు చార్జీలు పెంచారని వైసీపీ శ్రేణులు ధర్నా చేయడం సిగ్గుచేటని అన్నారు. సూపర్‌సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీటీ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కాలవ నాగరాజు, వైస్ చైర్మన్ సుభాన్, మత్స్యశాఖ సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు నగేష్, బీటీపీ మత్స్యకార సంఘం అధ్యక్షుడు శ్రీరా ములు, కార్యదర్శి సత్యనారాయణ, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకులు పాలబండ్ల శ్రీరాములు, ముత్యాల సాయినాథ్ బాబు, ఆసిఫ్, రామకృష్ణుడు తది తరులు పాల్గొన్నారు.

పీఎస్‌లో న్యాయవాది మృతి

సివిల్ పంచాయితీ చేస్తుండగా గుండెపోటు

సీఐ చాంబర్‌లో కుప్పకూలిన బీవీ శేషాద్రి



న్యాయవాది బీవీ శేషాద్రి(ఫైల్)

అనంతపురం క్రైం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో సివిల్ పంచాయితీ జరిగే సమయంలో సీనియర్ న్యాయవాది బీవీ శేషాద్రి(55) తీవ్ర గుండె పోటుతో కుప్పకూలిపోయారు. ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటన శని వారం రాత్రి 8.30గంటల సమయంలో చోటుచేసుకుంది. కోర్టు పరిధిలో ఉన్న ఓ ఆస్తి వివాదంలో శేషాద్రిని శనివారం రాత్రి అనంతపురం త్రీ టౌన్ స్టేషన్‌కు పోలీసులు పిలిపించారు. సీఐ చాంబర్‌లో వివాదం గురించి మాట్లాడుతుండగా శేషాద్రి తీవ్ర ఒత్తిడికి లోనై చనిపోయాడని ఆయన సన్ని హితులు చెబుతున్నారు. అనంతపురం నగ రంలోని నాలుగురోడ్డులో శేషాద్రి నివాసం ఉంటున్నారు. ఇంటి స్థలాన్ని ఆయన కుటుంబసభ్యుల్లో ఒకరు బయటి వ్యక్తికి విక్రయించేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. దీంతో ఎవరూ కొనుగోలు చేయకుండా శేషాద్రి లీగల్ నోటీసు పంపించారు. ఈ వివాదంలో కోర్టులో ఉన్నట్లు సమాచారం. ఈ విషయంపై అవతలి పార్టీ వారు ఇటీవల ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. దీంతో ఉన్నతాధికారులు త్రీటౌన్ పోలీసులకు రెఫర్ చేశారు. ఈ క్రమంలో ఎస్ఐ గోపాలుడు న్యాయవాది శేషాద్రికి శనివారం ఫోన్ చేసి, సీఐ రమ్మం టున్నారని చెప్పారట. సివిల్ పంచాయితీ, అందులోనూ కోర్టులో ఉంది కదా అని శేషాద్రి ప్రశ్నించడంతో, 'అవన్నీ తరువాత.. సీఐ రమ్మంటున్నారు..' అని వరుసగా ఫోన్లు చేశారని, సమాచారం. దీంతో శనివారం రాత్రి 7గంటల సమయంలో ఇద్దరు న్యాయ వాదులు, మరో వ్యక్తితో కలిసి శేషాద్రి త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. అరగంట తరు వాత వారిని సీఐ తన చాంబర్‌కు పిలిపిం చారట. ఆ సమయంలో సీఐ శాంతిలాల్, ఎస్ఐ గోపాలుడు వారితో మాట్లాడినట్లు సమాచారం. ఈ క్రమంలో పోలీసులు కాస్త కఠినంగా వ్యవహరించారని, అక్కడ ఉన్న కానిస్టేబుళ్ల మరింత కఠినంగా వ్యవహరిం చారని సమాచారం. అఅందుకే న్యాయవాది శేషాద్రి ఒత్తిడికి లోనయ్యారని, పైకి లేచి అంతలోనే కుప్పకూలిపోయారని న్యాయ వాది సన్నిహితులు చెబుతున్నారు. శేషాద్రికి గుండె సంబంధిత సమస్యలు ఉన్నాయని, ఒక కాలును పూర్తిగా తొలగించడంతో అనా రోగ్యంతో ఇబ్బంది పడుతున్నారని వారు తెలిపారు. అలాంటి వ్యక్తిని స్టేషన్‌కు పిలిచి కఠినంగా వ్యవహరించినందుకే గుండెపో టుతో మృతి చెందారని ఆరోపణలు వస్తు న్నాయి.

ఆస్పత్రికి వెళ్లేలోగా..

సీఐ చాంబర్‌లో కుప్ప కూలిన శేషాద్రిని ఆయనతోపాటు వచ్చిన ఇద్దరు న్యాయవా దులు పరిశీలించారు. అప్పటికే ఆయన మృతి చెందారని సమాచారం. పోలీసులు సూచన మేరకు నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అప్పుడికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అయితే, స్టేషన్‌లో మృతిచెందలేదని, తానే ఆటో ఎక్కించి పంపించానని సీఐ శాంతి లాల్ అన్నారు. అవతలిపార్టీవారు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినందుకే శేషాద్రిని స్టేషన్‌కు పిలిపించామని, సివిల్ పంచాయితీ కోసం కాదని అన్నారు.

నేడు న్యాయవాదుల ఆందోళన..?

న్యాయవాది శేషాద్రి మృతి వ్యవహారం వివా దాస్పదమౌతోంది. ఈ ఘటనపై న్యాయవా దులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీస్ స్టేషన్‌లో, అందులోనూ విచారణ సమ యంలో సీఐ చాంబర్‌లో మృతి చెందడం తోట న్యాయవాద వర్గాలు భగ్గుమంటు న్నాయి. న్యాయవాదులు ఆదివారం ఆందో ళన చేసేందుకు సిద్ధమౌతున్నారని సమా చారం. జిల్లా బార్ అసోసియేషన్ ప్రతినిధు లతో ఇప్పటికే మాట్లాడినట్లు తెలిసింది.

డీపీఓలో గందరగోళం

బాధ్యతలు అప్పగించని బదిలీ సిబ్బంది

ఫైల్స్ లభించక.. కొత్తవారికి కష్టాలు

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): బదిలీపై వెళ్లినవారు రికార్డులు, ఫైళ్లు అప్పగించకపోవడంతో డీపీఓ కార్యాలయ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. బదిలీపై వెళ్లిన క్లర్కులు కొత్తవారికి బాధ్య తలు అప్పగించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కొంతమంది చార్జ్ ఇచ్చినా.. ఫైల్స్ అప్పగించలేదు. దీంతో అవసరమైన సందర్భాలలో ఫైల్స్ కోసం కార్యాలయంలో గాలించాల్సి వస్తోందని బాధితులు వాపో తున్నారు. కోర్టు కేసులు, సమాచార హక్కు చట్టం కింద కోరిన వివరాలను అందుబాటులో లేకపోవడంతో సమస్యలు ఎదురవు తున్నాయి. చివరకు కొందరు ఉద్యోగుల ఎస్ఆర్‌లు కూడా కనిపిం చడం లేదు. కార్యాలయంలో అప్పగించామని బదిలీ అయినవారు అంటుంటే.. తమకు ఇవ్వలేదని కొత్తగా వచ్చినవారు అంటు న్నారు. దీంతో కార్యాలయంలో పరిస్థితి గందరగోళంగా మారింది.

మళ్లీ రావాలనే...?

డీపీఓలో ఏళ్ల తరబడి పని చేసిన వారు నిబంధనల మేరకు బదిలీ అయ్యారు. ఐదేళ్ల సర్వీసు పూర్తి అయినవారిని వేరే ప్రాంతాలకు పంపించారు. అలా వెళ్లినవారిలో కొందరు తిరిగి డీపీఓకు రావాలని ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగా, కొత్తగా వచ్చి నవారిని ఇరకాటంలో పెట్టేందుకు ఫైల్స్ రికార్డులను అప్ప గించలేదనే ఆరోపణలు వస్తున్నాయి. అయితే బదిలీపై, కాకుంటే డెప్యుటేషన్‌పై అయినా రావాలని పలువురు ప్రయత్నిస్తు న్నారని ప్రచారం జరుగుతోంది.

ఉన్నవారికి ఇబ్బందులు..

- సమాచార హక్కు చట్టానికి సంబంధించిన ఓ అధికారి రెండు రోజుల క్రితం డీపీఓకు వచ్చారు. తనకు కావాల్సిన వివరాలు అడి గితే.. సిబ్బంది సమకూర్చలేకపోయారు. ఆ అంశానికి సంబంధిం చిన ఉద్యోగి సెలవులో ఉన్నారని, వివరాలు తమకు తెలియవని ఏఓ సర్దిచెప్పారు. అయితే ఆ అధికారి సంతృప్తి చెందలేదు. తాను చాలారోజులగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నానని, అయినా వివరాలు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. డీపీఓతోనే తేల్చుకుంటానని హెచ్చరించారు. కానీ డీపీఓ కూడా సెలవులో ఉండటంతో ఆ అధికారి అసంతృప్తితో వెనుదిరిగారు.
- ఎస్ఆర్ కోసం ఓ ఉద్యోగి డీపీఓకు వచ్చారు. గంటల తరబడి కూర్చున్నా పని జరగలేదు. కార్యాలయం మూల మూలనా సిబ్బంది వెతికినా ఎస్ఆర్ లభించలేదు. సెలవులో ఉన్న వారి సామగ్రిలో ఏఓ వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో ఎన్నాళ్లు తిరగాలని ఆ ఉద్యోగి అధికారులతో వాగ్వా దానికి దిగారు. చేసేది లేక వెనుదిరిగారు.





ఏమిటీ గందరగోళం..?

డీపీఓ కార్యాలయంలో గందరగోళ వాతావరణం కొనసాగుతోంది. బదిలీపై వెళ్లినవారి బాధితులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం కోరిన వివరాలు సేకరించి నివేదిక పంపాలంటే పాత రికార్డులు అవసరమని, అవి ఎక్కడున్నాయో తెలియడం లేదని వాపోతున్నారు. రోజువారీ పనులకే సమయం చాలటం లేదని, ఇక పెండింగ్ పనుల మాటేమిటని ప్రశ్నిస్తున్నారు. సీనియారిటీ జాబితాల తయారీ ప్రక్రియ కూడా ముందుకు సాగడం లేదు. డీపీఓ నాగరాజనాయుడు దృష్టి సారించి.. పరిస్థితిని గాడిలో పెట్టాల్సిన అవసరం ఉంది.

మందుబాబుల సేవాకేంద్రం..!





◄ నిర్మాణ దశలో ఉన్న రైతు సేవా కేంద్రం, అద్దె భవనంలో ఉన్న రైతు సేవా కేంద్రం ▲

అనంతపురం రూరల్ మండల పరిధిలోని మన్నీలలో రైతు సేవా కేంద్రం కోసం నిర్మించిన భవనం ఇది. అధికారులు వాడుకోవడం లేదు. దీంతో సంప్ర దాయం ప్రకారం మందుబాబులు వాడుకుంటున్నారు. చీకటి పడితే అక్కడ వాలిపోతున్నారు. వైసీపీ హయాంలో ఈ భవన నిర్మాణానికి రూ.21.40 లక్షలు కేటాయించారు. పనులు చేపట్టిన కాంట్రాక్టరుకు రూ.19 లక్షలు బిల్లులు చెల్లించారు. నిర్మాణం తుది దశకు చేరుకున్న తరువాత వ్యవసాయ, పంచాయతీ రాజ్ శాఖల అధికారుల తీరుతో పనులు ఆగిపో యాయి. నాలుగు కిటికీలు, ఒక తలుపు బిగిస్తే ఈ భవంతిలో రైతు సేవలను ప్రారంభించవచ్చు. కానీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా భవనం చుట్టూ ముళ్ల పొదలు పెరిగాయి. ప్రజా ధనాన్ని వెచ్చించి నిర్మించిన భవంతిని గాలికి వదిలేసి, నెల నెలా వేలాది రూపాయలు అద్దె చెల్లిస్తూ వేరే భవంతిలో రైతు సేవా కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయించి, భవ నాన్ని అందుబాటులోకి తెస్తామని పీఆర్ జేఈ శేషయ్య అన్నారు.


- ఆంధ్రజ్యోతి, అనంతపురం రూరల్

పప్పుశనగకు వాన దెబ్బ

- వర్షానికి కుళ్లి పోతున్న పైరు
- 500ఎకరాలకు పైనే దెబ్బతిన్న పంట
- ఆందోళనలో అన్నదాతలు



(వివరాలు 7లో..)





ఉమ్మడి జిల్లా పారిశ్రామిక ప్రగతిలో మణిపూస కియ. ఈ అంతర్జాతీయ కార్ల ఫ్యాక్టరీ గత టీడీపీ పాలనా కాలంలో జిల్లాలో స్థాపించబడింది. దీని ద్వారా వేలాది మంది ఉపాధి పొందుతున్నారు. కియతో స్ఫూర్తి పొంది, ఇతర పరిశ్రమల పెట్టుబడులు వస్తున్న తరుణంలో అధికారంలోకి వచ్చిన వైసీపీ పారిశ్రామిక రంగాన్ని నిర్లక్ష్యం చేసింది. విశాఖ వేదికగా నిర్వహించిన గ్లోబుల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్- 2023 ద్వారా జిల్లాకు పెద్ద సంఖ్యలో పరిశ్రమలు వస్తాయని, ఆమేరకు వివిధ సంస్థలతో ఒప్పందాలు కుదిరాయని నాటి సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రకటించారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు జిల్లాలో పలు పరిశ్రమలకు శంకుస్థాపనలు చేసి, శిలాఫలాలు వేసి హామీల గారడీ చేశారు. అయితే కొత్తగా ఒక్క ఫ్యాక్టరీ కూడా జిల్లా వైపు చూడలేదు. ఇలా ఈఏడాది మొదటి ఐదురు నెలల్లో పారిశ్రామిక రంగం నేలచూపులు చూసింది. టీడీపీ హయాంలోనే పాలసముద్రం వద్ద 503 ఎకరాల్లో ఏర్పాటు చేసిన నాసిన్ సంస్థను ప్రధాని మంత్రి నరేంద్రమోదీ, ముఖ్య మంత్రి జగన్‌మోహన్‌రెడ్డిలు జనవరి 16న ప్రారంభించారు. భారత్ ఎలక్ట్రానిక్స్ డిఫెన్స్ సిస్టమ్ ఇంటిగ్రేషన్ సముదాయం (భెల్) నత్తనడకన సాగింది. ఇలా వైసీపీ పాలనలో పారిశ్రామిక ప్రగతి జిల్లాలో కుంటుపడింది. అయితే కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడంతో జిల్లా పారిశ్రామిక ప్రగతిపై ఆశలు చిగురించాయి. గడచిన ఆరున్నర నెలల్లో జిల్లాలో పారిశ్రామిక పురోగతికి కూటమి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. ఈక్రమంలో పారిశ్రామికవేత్తలు కూడా పెట్టుబడులు పెట్టడానికి ఉత్సాహం చూపుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి/ అనంతపురం అర్బన్

ప్రగతి పరుగులు

జిల్లా పారిశ్రామికరంగానికి పూర్వ వైభవం

- ఉద్యోగాల కల్పన దిశగా అడుగులు
- జిల్లాకు టెస్లాను ఆహ్వానించిన మంత్రి లోకేశ్
- కూటమి ప్రభుత్వం రాకతో పారిశ్రామికవేత్తల్లో ఉత్సాహం
- అనంతలో విమానాశ్రయం ఏర్పాటుకు ఆలోచన
- వైసీపీ పాలనలో హడావుడి తప్ప కానరాని అభివృద్ధి
- 2024లో పారిశ్రామిక వెలుగు నీడల రౌండప్



నాసిన్‌ను ప్రారంభిస్తున్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ తదితరులు (ఫైల్)

4.0 పాలసీతో పారిశ్రామిక వెలుగులు

అధికారంలోకి రాగానే కూటమి ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధి పాలసీ 4.0 తీసుకువచ్చింది. జిల్లాలకు జాతీయ రహదారుల అనుసంధానం, విస్తీరణతోపాటు జాతీయ రహదారుల వెంట పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి బాటలు పడ్డాయి. పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో మంత్రి నారా లోకేశ్ అమెరికాలో పర్యటించారు. విద్యుత్ వాహనాల (ఈవీలు) బ్యాటరీలను తయారు చేసే పరిశ్రమ పెట్టాలని దిగ్గజ సంస్థ టెస్లాను ఉమ్మడి జిల్లాకు ఆహ్వానించారు. 2014-19లో టీడీపీ హయంలోనే కియ, బెల్, నాసిన్ ఏర్పాటుతో శ్రీసత్యసాయి జిల్లా ఆటోమొబైల్ హబ్‌గా, పారిశ్రామిక కారిడార్‌గా అవతరించింది. అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే కూటమి ప్రభుత్వం జిల్లా పారిశ్రామిక ప్రగతికి బాటలు వేసింది. జిల్లాలో పారిశ్రామిక, వ్యవసాయ రంగాలతోపాటు రహదారులు అభివృద్ధి, అనుసంధానం, ఎయిర్ కనెక్టివిటీకి శరవేగంగా అడుగులేస్తోంది. కియ సంస్థకు అనుబంధంగా మరిన్ని పరిశ్రమల ఏర్పాటుతోపాటు జిల్లాలోను ఎంఎస్ఎంఈ పార్కుల్లో పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి సారించారు. జిల్లాలో చిలమత్తూరు, మడకశిరలో పారిశ్రామిక కస్టర్ ఏర్పాటు, పారిశ్రామిక జిల్లా సమీక్ష సమావేశాలు, ఔత్సాహికుల ఆకర్షణతోపాటు జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో పారిశ్రామికాభివృద్ధి ప్రణాళికలు రూపొందించారు. జిల్లాలో ఈ ఆరునెలల్లో రూ. 1239 కోట్ల పెట్టుబడులతో 4049 మందికి ఉపాధి కల్పన దిశగా 32 పరిశ్రమలకు 1056 ఎకరాల భూముల కేటాయింపులు చేశారు.




మడకశిరలో కేఎస్ఎస్ఎల్‌కు భూములు కేటాయింపు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆగస్టు ఒకటిన మడకశిర ప్రాంత పర్యటనకు వచ్చిన సందర్భంగా ఆ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు రక్షణ రంగానికి అవసరమైన ఫిరంగుల మందు గుండు సామగ్రి తయారు చేసే పరిశ్రమ అయిన భారత్ ఫోర్జ్‌కు అనుబంధ సంస్థ కళ్యాణి స్ట్రాటజిక్ సిస్టం లిమిటెడ్ (కేఎస్ఎస్ఎల్)కు భూములు కేటాయించారు. ఈ సంస్థ మొదటి దశలో రూ.1430 కోట్లుతో పెట్టుబడి పెట్టనుంది. మొదటి దశలో 565 మందికి ఉపాధి లభించనుంది. అలాగే మడకశిర మండలం బుల్లసముద్రం, హరేసముద్రం, మనూరు, కల్లుమర్రి గ్రామాల పరిధిలో 10 వేల ఎకరాల్లో సోలార్ పార్క్ ఏర్పాటుకు సోలార్ పరిశ్రమలు ముందుకువచ్చాయి. ఇలా మడకశిర నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు 3043ఎకరాల భూములను సిద్ధం చేశారు. మడకశిర ప్రాంత వక్క రైతులకు మార్కెట్ సౌకర్యం కల్పించేందుకు అమరాపురంలో వక్క మార్కెట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను మంజూరు చేసి స్థల పరిశీలన చేశారు.

చిలమత్తూరులో పారిశ్రామిక క్లస్టర్

కర్నాటక సరిహద్దు టేకులోడులో 1105 ఎకరాల్లో భారీ ఇండస్ట్రియల్ క్లస్టర్ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. టేకులోడు వద్ద ఇప్పటికే 225 ఎకరాల్లో ఏపీఐఐసీ ఎంఎస్ఎంఈ పారిశ్రామికవాడలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తోంది. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి 3.5 ఎంఎల్‌డీ సామర్థ్యంతో తాగునీటి ప్రత్యేక పైపులైన్ నిర్మాణ పనులు తుది దశకు వచ్చాయి. ఇక్కడే మరో 880 ఎకరాల భూములు సేకరించడానికి ఏపీఐఐసీ ప్రయత్నాలు మొదలు పెట్టింది. పుట్టపర్తిలో రూ.ఏడు కోట్లతో కప్పలబండ పారిశ్రామిక పార్కులో మౌలిక సదుపాయాల కల్పన పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇటీవల రాష్ట్ర సూక్ష్మ మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ జిల్లాలో పర్యటించి జిల్లాలో పారిశ్రామికవాడతోపాటు ఎంఎస్ఎంఈ పార్కుల పురోగతిపై సమీక్ష చేపట్టారు. ఈనేపథ్యంలో జిల్లాలో పారిశ్రామిక ప్రగతి పరుగులు పెట్టనుంది.



టేకులోడు పారిశ్రామిక పార్కు



ఎన్నికల ముందు వర్చువల్‌గా కలెక్టరేట్‌లో అప్పటి సీఎం జగన్ ఆవిష్కరించిన పరిశ్రమల శంకుస్థానం శిలాఫలకం

ఎన్నికల ముందు హడావుడి

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటు, ఉపాధి పేరుతో అప్పటి ముఖ్యమంత్రి జగన్ పారిశ్రామిక అభివృద్ధి డ్రామాకు తెర తీశారు. హడావిడిగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసేశారు. వర్చువల్ విధానం ద్వారా కదిరి మండలం పట్నంలో రూ.4.41 కోట్లతో మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్, సోమందేపల్లి గుడిపల్లి వద్ద రూ. 125 కోట్లతో యునైటెడ్ ఇండస్ట్రీస్ ఆటోమేటివ్ ప్లాస్టిక్ ప్రైవేట్ కంపెనీ, మడకశిర మండలం ఆర్ అనంతపురం వద్ద రూ.250 కోట్లతో ఎవరెస్ట్ స్టీల్ బిల్డింగ్ కంపెనీల పనులకు సీఎం హోదాలో భూమి పూజ చేశారు. ఈమూడు పరిశ్రమలు ఏడాదిలో ఉత్పిత్తి ప్రారంభించనున్నట్లు తెలిపారు. వీటి ద్వారా ప్రత్యక్షంగా 1370 మందికి ఉపాధి అవకాశాలు వస్తాయని గొప్పగా చెప్పారు. ఈక్రమంలోనే పుట్టపర్తి జిల్లా కేంద్రం కప్పలబండ పారిశ్రామికవాడలో మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు రూ. 11.71 కోట్లు, హిందూపురం పారిశ్రామికవాడకు రూ7.15 కోట్ల నిధులు మంజూరు చేశారు. పారిశ్రామిక వాడల్లో సూక్ష్మ, చిన్న తరహా సంస్థల అభివృద్ధి కార్యక్రమం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో వివిధ కంపెనీల ఏర్పాటుకు ప్లాట్లు అభివృద్ధి చేస్తున్నట్లు సీఎం జగన్ ప్రకటించారు. ఇవేవి ఒక్క అడుగు ముందుకుసాగకపోగా వర్చువల్ శంకుస్థాపనలకే పరితమయ్యాయి. పెనుకొండ, గుడిపల్లి, గోళ్లాపురం, ఎర్రమంచి, రాళ్లఅనంతపురం, కొటిపి, కదిరి కూటగూళ్ల, శెట్టిపల్లి, దాదలూరు, కేతగానిచెరువు, కప్పలబండ వద్ద పారిశ్రామిక పార్కులతోపాటు భూములు సిద్ధంగా ఉన్నా ఈభూముల్లో వైసీపీ ప్రభుత్వం ఎక్కడా ఒక్క పరిశ్రమను కూడా తీసుకురాలేకపోయింది.

అనంత జిల్లాలో...

అనంతపురం జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ ఏడాది ఎన్డీఏ కూటమి అధికారంలోకి రాగానే 2023 -2027 పాలసీని రద్దు చేశారు. ఈ ఏడాది అక్టోబరులో 2024- 2029 కొత్త పరిశ్రమల పాలసీని ప్రవేశపెట్టారు. అక్టోబరు 24 నుంచి కొత్త పాలసీ అమలవుతుంది. ఆ మేరకు జీవో జారీ చేశారు. త్వరలోనే గైడ్‌లైన్స్ జారీ చేసి, పారిశ్రామిక ఔత్సాహికులను ప్రోత్సహించేందుకు సిద్ధమయ్యారు.

జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటుకు యోచన



కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీలు,అంబికా, బీకే, మంత్రి కేశవ్ (ఫైల్)

జిల్లా నుంచి ఉద్యాన పంటల ఎగుమతి కోసం విమానాశ్రయం ఏర్పాటు చేయాలన్న ఆలోచనలో కూటమి ప్రభుత్వం ఉంది. ఈ ఏడాది జూలై నెలలో జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటుకు ప్రత్యేక చొరవ చూపాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడును రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఉమ్మడి అనంత జిల్లా ఎంపీలు బీకే పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ కోరారు. ఏవియేషన్ ట్రైనింగ్ కోసం కృషి చేయాలని కోరారు. ఇదే అమలైతే దక్షణాదిలోనే మొట్టమొదటి ఉద్యాన ఉత్పత్తుల ఎగుమతి కేంద్రంగా, విమానాశ్రయంగా జిల్లా గుర్తింపు పొందనుంది.

పారిశ్రామికవేత్తలకు వైసీపీ మొండిచేయి

పారిశ్రామికవేత్తలకు వైసీపీ ప్రభుత్వం మొండి చేయి చూపింది. 2021 సెప్టెంబరు మాసం నుంచి గత ఏడాది మంజూరైన పరిశ్రమలు, పలు రకాల వాహనాలకు అందాల్సిన సబ్సిడీ డబ్బులను ప్రభుత్వం ఆపేసింది. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అమలయ్యే ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీ, జగనన్న బడుగు వికాసం పథకాలకు సంబంధించి సేవా రంగం, ఉత్పత్తి రంగాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసిన పారిశ్రామిక వేత్తలతోపాటు పలు రకాల వాహనాలు కొనుగోలు చేసిన లబ్ధిదారులకు సబ్సిడీ డబ్బులు చెల్లించలేదు. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైసీపీ సర్కార్ నిర్వాకంతో జిల్లా వ్యాప్తంగా 595 యూనిట్లకు సంబంధించిన రూ.70 కోట్లకుపైగా సబ్సిడీ మొత్తం పెండింగ్‌లో ఉండిపోయింది.

వైసీపీ ఐదేళ్ల పాలనలో కప్పలబండ పారిశ్రామిక వాడ ఇలా...





ఆరునెలల్లో కప్పలబండ పారిశ్రామిక పార్కు విస్తరణ దిశగా కూటమి ప్రభుత్వం

2023-27 పాలసీ ఆలస్యంగా అమలుతో అన్యాయం

గత ప్రభుత్వం 2023- 2027 పారిశ్రామిక పెట్టుబడి పాలసీని ఆలస్యంగా అమలు చేయడంతో తీవ్ర అన్యాయం జరిగింది. 2023 ఏప్రిల్ నుంచి కొత్త పాలసీని అమలు చేయాల్సి ఉంది. అయితే అప్పట్లో కేవలం సబ్సిడీ ధరలు ఖరారు చేశారు. గైడ్‌లైన్స్, జీవోలను విడుదల చేయడంలో జాప్యం చేసింది. దీంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవకాశం లేకుండా పోయింది. ఈ ఏడాది జనవరి మొదటి వారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. పాత వారికే సబ్సిడీ డబ్బులు ఇవ్వని ప్రభుత్వం కొత్త వారికి ఎప్పుడు ఇస్తుందన్న అభద్రతా భావంతో అనేక మంది కొత్తగా పరిశ్రమలు, ట్రాన్స్‌పోర్టు యూనిట్లకు దరఖాస్తు చేసుకునేందుకు వెనుకంజ వేశారు.

కొత్త పారిశ్రామిక వాడల ఏర్పాటుకు చర్యలు

వైసీపీ ప్రభుత్వం పారిశ్రామిక వాడల ఏర్పాటును పూర్తిగా విస్మరించింది. ఎన్డీఏ కూటమి అధికారంలోకి రాగానే ఉమ్మడి అనంత జిల్లాలో పారిశ్రామిక వాడలు ఏర్పాటు చేసి పారిశ్రామిక ఔత్సాహికులను ప్రోత్సహించేలా నిర్ణయాలు తీసుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు, మడకశిరలో పారిశ్రామిక వాడలు ఏర్పాటులో సంబంధిత అధికారులు నిమగ్నమయ్యారు. అందుకు సంబంధించిన స్థలం సేకరణ పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే జిల్లాలోని కూడేరు పరిధిలో పారిశ్రామిక వాడ ఏర్పాటు కోసం 353 ఎకరాలను సేకరించారు.

జడ్పీ నూతన సీఈఓగా రామచంద్రారెడ్డి



జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను కలిసిన కొత్త సీఈఓ, డిప్యూటీ సీఈఓ

అనంతపురం విద్య, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ నూతన సీఈఓగా రామచంద్రారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. నంద్యాల డ్వామా పీడీగా పనిచేస్తున్న ఆయనను ఉద్యోగుల సాధారణ బదిలీల్లో భాగంగా నవంబరు నెలలో అనంతపురం జిల్లా సీఈఓగా నియమించారు. అయి తే దీర్ఘకాలిక సెలవులో ఉండటంతో...అప్పట్లో విధుల్లో చేరలేదు. దీంతో డిప్యూటీ సీఈఓకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. సెలవుల అనంతరం జిల్లాకు వచ్చిన ఆయన డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్యతో పాటు జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను ఆమె చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమెకు పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన సీఈఓగా బాధ్యతలు తీసుకున్నారు. కొత్త సీఈఓను జిల్లా పరిషత్ ఉద్యోగులు, సిబ్బంది కలసి శుభాకాంక్షలు తెలిపారు.

వార్షికోత్సవాలను విజయవంతం చేయండి

ఎస్ఎస్‌బీఎన్ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు రమేష్‌బాబు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు రమేష్‌బాబు

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): సాయిబాబా అనుగ్రహంతో పెరిగిన మహావృక్షమే ఎస్ఎస్‌బీఎన్ విద్యాసంస్థలని పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు రమేష్‌బాబు పేర్కొన్నారు. ఆ విద్యాసంస్థల 80 వార్షికోత్సవాలకు సంబంధించి శనివారం నగరంలోని ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాలలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. విద్యాసంస్థ స్థాపించి 80 సంవత్సరాలు గడిచిన నేపథ్యంలో... అప్పటి అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు, ప్రస్తుత అధ్యాప కులంతా కలిసి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలిపారు. జనవరి 3, 4, 5 తేదీలలో మూడ్రోజుల పాటు జరిగే ఈ వేడుకలకు సంబంధించి భారీస్థాయి లో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కావున పాఠశాల, కళాశాలలో విద్యనభ్యసించి దేశం నలు మూలల స్థిరపడిన అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు ఈ వేడుకలకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం కార్యదర్శి సుంకు వేణుగోపాల్, కోశాధికారి చంద్రశేఖరగుప్త, ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రాజు, నిర్మలమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతుల భూములపై కార్పొరేట్ల కన్ను: సీపీఐ

అనంతపురం విద్య, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): సోలార్, గాలిమరల పేరుతో రైతుల భూములను కాజేయడానికి అదానీ, కార్పొరేట్ శక్తులు కుట్రలు చేస్తున్నాయని సీపీఐ నాయకులు ఆరోపించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం రైతు సంఘం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్ మాట్లాడుతూ రైతుల భూములను 20 ఏళ్లకు లీజుకు తీసుకుని, వాటిని బ్యాంకుల్లో తనఖా పెట్టి రుణాలు తీసుకుని సోలార్, గాలిమరల కంపెనీలు ఏర్పాటు చేస్తారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే 50 శాతం రాయితీలు కూడా తీసుకుంటారన్నారు. అనంతపురంలో జిల్లాలో పండే పండ్లను కార్గో విమానాల ద్వారా విదేశాలకు ఎగుమతి చేయాలని ప్రభుత్వం చూస్తోందన్నారు. హంద్రీనీవా కాలువను కూడా వెడల్పు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు సోలార్, గాలిమరల కంపెనీలకు తమ భూములిచ్చి నష్టపోవద్దని సూచించారు. అధికారంలో ఉన్నప్పుడు జగన్ రూ.20 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై మోపేలా ప్రణాళిక సిద్ధం చేశాడన్నారు. దొంగే దొంగ అన్నట్లు ఇప్పుడేమో ఆయనే కరెంటు చార్జీలపై ధర్నాలు చేయడం ఆశ్చర్యంగా ఉందని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చిన ఆరు మాసాల్లోనే కూటమి ప్రభుత్వం కూడా చార్జీలు పెంచడం సరికాదన్నారు. విద్యుత్ చార్జీలు తగ్గించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శులు మల్లికార్జున, ఇతర నేతలు నారాయణస్వామి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జగదీష్

జీవో 77 రద్దు చేయాలి : విద్యార్థి సంఘాల నేతలు

పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో 77ను రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, వైఎస్ఆర్ సీపీ, ఏఐవైఎఫ్ తదితర సంఘాల నేతలు సీపీఐ ఆఫీస్‌లో సమావేశం నిర్వహించారు. నాయకులు కుళ్లాయిస్వామి, నరేష్, చంద్రశేఖర్, హనుమంతురాయుడు తదితరులు మాట్లాడుతతూ పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.3580 కోట్లు వెంటనే విడుదల చేయాలన్నారు. డిమాండ్ల సాధనకు ఈనెల 30న విజయవాడలో దీక్ష జరుగుతుందని, విద్యార్థులు జయప్రదం చేయాలని కోరారు.

కుష్ఠును తొలిదశలో గుర్తిస్తే కట్టడి సులభం

జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టరు అనుపమ జేమ్స్

అనంతపురం టౌన్, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధిని తొలిదశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే వైకల్యం రాకుండా అడ్డుకట్ట వేయవచ్చని జిల్లా కుష్ఠు నివారణ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనుపమ జేమ్స్ సూచించారు. జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో శనివారం నెలవారి సమీక్ష నిర్వహించారు. ఇంటింటా సర్వే, కేసుల గుర్తింపు, చికిత్సలకు తీసుకున్న చర్యలు గురించి ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కుష్ఠు అతి సాధారణమైనదని, ఈవ్యాధి ఏదశలో ఉన్నా ఆరునెలలు లేదా 12నెలలు మందులు వాడితే నయమవుతుందన్నారు. కానీ చాలామందికి దీనిపై అవగాహనలేక భయపడిపోతున్నారన్నారు. ఇంకొందరు బయటకు చెప్ప కుండా దాచిపెట్టుకుని తీవ్ర సమస్యగా తెచ్చుకుంటున్నారన్నారు. అందుకే ప్రభుత్వం ప్రతి ఒక్కరిని గుర్తించి వారికి తగిన సమయంలో వైద్యం అందించి వ్యాధి నుంచి కాపాడాలనే సర్వే చేపడుతోందన్నారు. ఈసర్వేలో అనుమానపు లక్షణాలు మచ్చలు ఉన్నవారిని గుర్తించి, వారికి కుష్ఠు పరీక్షలు నిర్వహించా లన్నారు. ఒకవేళ కుష్ఠు అనే అనుమానం వస్తే వారు నిబంధనల మేరకు చికిత్స, మందులు వాడేలా చూడాల్సిన బాధ్యత వైద్యసిబ్బందిపై ఉందన్నారు. ఈవిషయంలో పారామెడికల్ ఆఫీసర్లు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఆస్పత్రుల లోనే ఉచితంగా మందులు ఇస్తారని, ఎక్కడా మందులు లేవనే మాటరాకుండా చూడాలన్నారు. బాధితులకు ప్రభుత్వం రూ.ఆరువేలు పింఛన్ అందిస్తోందన్నారు. కార్యక్రమంలో డాక్టరు గంగాధరరెడ్డి, డాక్టరు శివారెడ్డి, పారామెడికల్ అధికారి నాగన్న, సత్యనారాయణ, రాముడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టరు అనుపమజేమ్స్

పీఎం ఉపకార వేతనానికి దరఖాస్తు చేసుకోండి

జిల్లా సైనిక సంక్షేమశాఖాధికారి తిమ్మప్ప

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లాలోని మాజీ సైనికులు... పిల్లలకు కేంద్ర ప్రభుత్వం అందించే ప్రధాన మంత్రి ఉపకార వేతనానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సైనిక సంక్షేమ శాఖాధికారి తిమ్మప్ప సూచించారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొ న్నారు. ఉమ్మడి జిల్లాలోని మాజీ సైనికులు తమ పిల్లల ఉపకార వేతనం కోసం సోమవారం నుంచి జనవరి 3 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరి న్ని వివరాలకు ఫోన్ నంబరు 08554-241146కు సంప్రదించాలన్నారు.

31న సినీగేయ వజ్రోత్సవ సదస్సు

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూలో ఈ నెల 31న సినీగేయ వజ్రోత్సవ సదస్సును నిర్వహించనున్నట్లు పీఆర్వో ప్రొఫెసర్ రామగోపాల్ శనివారం ప్రకటనలో తెలిపారు. డాక్టర్ నందమూరి తారక రామారావు నటించిన తొలిచిత్రం 'మన దేశం' విడుదలై 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వజ్రోత్సవ సదస్సును నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నా రు. తెలుగు తులనాత్మక సాహిత్య శాఖ, మహాబోధి సాహిత్యశాఖ సంయుక్తాధ్వర్యంలో ఏర్పాటు చేస్తే సదస్సుకు ముఖ్యతి అతిథిగా వర్సిటీ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి హాజరవుతారని తెలిపారు.

యువకుడి అదృశ్యంపై కేసు



జయసాయి

నార్పల, డిసెంబరు 28(ఆంధ్ర జ్యోతి): మండలంలోని బీ పప్పూరుకు చెందిన ఆదినారాయణ, సరస్వతి దంపతుల కుమారుడు జయసాయి అనే యువకుడి ఆదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సాగర్ శనివారం తెలిపారు. 18 సంవత్సరాలు వయస్సున్న జయసాయి చెవుడు, మూగ వాడన్నారు. వారం నుంచి కనిపించటం లేదని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అతడి ఆచూకీ తెలిస్తే సెల్ ఫోన్ నంబర్లు 9849498492, 9966163496 సమాచారం ఇవ్వాలని ఎస్ఐ తెలిపారు.

క్రైం కార్నర్

ఉపాధ్యాయుడి ఆత్మహత్య కేసులో ఇద్దరి అరెస్ట్

కూడేరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మూరు గ్రామం వద్ద ఉన్న అగ్రిగోల్డ్ వెంచర్స్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న భాస్కర్‌బాబు కేసులో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. సీఐ రాజు అందించిన వివరాల మేరకు.. అనంతపురం పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు భాస్కర్‌బాబు తాను రూ.60 లక్షలు నరేష్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులుకు ఇచ్చానని, తిరిగి ఇవ్వకపోవడంతో బ్యాంకుల్లో, ఈఎంఐల ద్వారా తీసుకున్న అప్పులు చెల్లించలేక ఆత్మహత్య చేసుకున్నట్లు సూసైడ్ నోట్లో రాసిన విషయం తెలిసిందే. మృతుడి భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ కేసులో నరేష్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డిపై కేసు

ఉరవకొండ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డితో పాటు మరో 16 మంది వైసీపీ నాయకులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. విద్యుత్ చార్జీల పెంపుపై వైసీపీ నాయకులు అనుమతులు తీసుకోకుండా విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ఆందోళన చేశారని, ఆ శాఖ అధికారి భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి గోవిందు, వైసీపీ నాయకుల ర్యాలీ సందర్భంగా ట్రాఫిక్ ఇబ్బందులు కలిగాయని ఫిర్యాదు చేశారు. రెండు ఫిర్యాదుల మేరకు మాజీ ఎమ్మెల్యే, 16 మంది, మరికొందరిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని సీఐ మహానంది శనివారం తెలిపారు.

హత్య కేసులో ముగ్గురి అరెస్టు


నిందితులతో సీఐ, సిబ్బంది

గుంతకల్లు టౌన్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): భార్యను హత్య చేసిన కేసులో భర్తతో పాటు ఇద్దరు స్నేహితులను శనివారం అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ ఏపీ మస్తాన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ కర్నూలు జిల్లా మద్దికెర మండలం అగ్రహారం గ్రామానికి చెందిన చాకలి రఘురాముడు దోసులుడికి గ్రామంలో ఆర్‌ఎంపీ వైద్యుడిగా పనిచేస్తున్నాడు. రఘురాముడు అతని భార్య సురేఖ(28)మీద అనుమానం పెంచుకొని హత్యచేయాలని పథకం రచించాడన్నారు. దోసులుడికి గ్రామానికి చెందిన అరికిచెర్ల రామ్మోహన్, గుంతకల్లు పట్టణం భాగ్యనగర్‌కు చెందిన షేక్ మస్తాన్‌వలి సహాయం తీసుకున్నాడు. ఈనెల 3వ తేదీన నీకు మంచిఉద్యోగం ఇప్పిస్తానని భార్య సురేఖను గుంతకల్లులోని గుత్తిరోడ్డులో ఉన్న తన స్నేహితుడు రామ్మోహన్ బోరుగుల షాప్ వద్దకు పిలిపించాడన్నారు. భర్త రఘురాముడు, రామ్మోహన్‌లు సురేఖను షాపులో తీసుకెళ్లి ఆమెను చున్నీతో గొంతు నులిమి హత్య చేశారు. సురేఖ మృతదేహాన్ని ప్లాస్టిక్ సంచిలో కట్టి మరో స్నేహితుడైన మస్తాన్‌వలిని పిలిచి అతని సహాయంతో శవాన్ని పాతకొత్తచెరువు గ్రామంలోని చెరువులో పడేశారన్నారు. తన భార్య కనిపించటం లేదని రఘురాముడు టూటౌన్‌పోలీస్‌స్టేషన్‌లో అదే రోజు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మృతురాలి కాల్‌డేటా, రఘురాముడు కాల్‌డేటా పరిశీలించి, సీసీ కెమెరా ద్వారా ఆధారాలను సేకరించామన్నారు. రఘురాముడు మీద అనుమానంతో అతన్ని అదుపులోకి తీసుకొని విచారించగా హత్యచేసి చెరువులో పడేసినట్లు నేరం ఒప్పుకున్నాడన్నారు. శనివారం ముగ్గురిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు. వన్‌టౌన్ సీఐ మనోహర్, ఏఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

కుందుర్పి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సంపల్లిలో వెలసిన శివాలయంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిగినట్లు పశువుల కాపరులు శనివారం గుర్తించారు. పురాతన శివాలయం కుందుర్పి, అల్లాపురం గ్రామాల మధ్య ఉంది. గుర్తుతెలియని వ్యక్తులు గుప్తనిధుల కోసం ఆలయంలో తవ్వకాలు చేపట్టారు.

మిద్దెపై నుంచి పడి కార్మికుడి మృతి

తాడిపత్రి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోరాటకాలనీకి చెందిన కంబగిరి(40) అనే కార్మికుడు శనివారం మిద్దెపైనుంచి జారిపడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కంబగిరి బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇంటిపైకి మెట్లు ఎక్కుతుండగా జారి కిందపడి మృతిచెందాడు. కంబగిరికి భార్యతో పాటు కూతురు, కుమారుడు ఉన్నారు.

పప్పుశనగకు.. వాన దెబ్బ..!

- వర్షానికి కుళ్లిపోతున్న పైరు
- 500 ఎకరాలకుపైనే దెబ్బతిన్న పంట
- ఆందోళనలో అన్నదాతలు


దెబ్బతిన్న పప్పుశనగ పంట

పుట్లూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): అసలే తెగుళ్లతో సతమతమవుతున్న పప్పుశనగ రైతులను జడివాన తీవ్ర ఇబ్బంది పెడుతోంది. నాలుగు రోజులుగా కురుస్తున్న జల్లులకు పైరు కుళ్లిపోతోంది. బూజుతెగులు, ఎండు తెగులు ఉధృతితో వందల ఎకరాల్లో పంట దెబ్బతింటోంది. మండలంలో 15300ఎకరాల్లో పప్పుశనగ పంటను సాగుచేశారు. వీటిలో సుమారు 500ఎకరాలకు పైగానే పంట కుళ్లిపోయి దెబ్బతింది. శనగలగూడూరు, నారాయణపల్లి, గాండ్లపాడు, ఎస్. తిమ్మాపురం, తక్కళ్లపల్లి, పుట్లూరు, చాలవేముల, వెంగన్నపల్లి, గోపరాజుపల్లి, నాగిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో తెగుళ్లకు వాన తోడవడంతో పంట కుళ్లిపోతోంది. గతంలో ఎకరాకు 5 క్వింటాళ్ల నుంచి 8క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేది. ప్రస్తుతం వర్షం దెబ్బతో ఎకరాకు రెండు మూడు క్వింటాళ్ల దిగుబడి వచ్చేది కూడా కష్టమేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


పూతదశలో ఉన్న పంట

పూతదశలో వర్షం దెబ్బ

శనగపంట ఎదుగుదలకు ఎండ ఎక్కువగా ఉండాలి. అయితే గత వారం రోజుల నుంచి ఆకాశం మబ్బులతో నిండి ఉంటోంది. దీంతో పంటలో తెగుళ్ల ఉధృతి పెరిగింది. వంక నారవల్లో ఉన్న పైరుకు నీటిశాతం ఎక్కువ అవడంతో కుళ్లిపోతోంది. పంట పూతదశలో ఉండి బుడ్డలు పడే సమయం వచ్చింది. ఇప్పుడు వర్షం పడటం వల్ల పూతరాలిపోతోందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే పులుపు మొత్తం పోయినట్లు పేర్కొన్నారు. పడిన వర్షం మొక్క కాండం కిందకు దిగి కుళ్లిపోతున్నట్లు చెబుతున్నారు.

పంట మొత్తం దెబ్బతింది



ఈ ఏడాది వర్షం బాగా వచ్చింది. పంటలు కూడా బాగా పండుతాయని అనుకుంటున్న సమయంలో వర్షం మా ఆశలపై నీళ్లు పోసింది. నేను 13ఎకరాల్లో పప్పువనగ పంట సాగు చేశాను. ఎకరాకు రూ.20వేలు పెట్టుబడి పెట్టి నష్టపోయా. బుడ్డలు పడే సమయంలో వర్షం రావడంతో అవి నాశులుగా తయారయ్యే అవకాశం ఉంది. ఈ ఏడాది కూడా రైతులు నష్టపోవాల్సి ఉంటుంది.

-నరసింహుడు, రైతు నారాయణపల్లి

కూలీల డబ్బులు కూడా రావు



పెట్టుబడి పోను కూలీల డబ్బులు కూడా వచ్చే అవకాశం లేదు. సాధారణంగా శనగకట్టె కోయడానికి ఎకరాకు ఆరు నుంచి 8 మంది పట్టే అవకాశం ఉంది. 15ఎకరాల్లో పంట సాగు చేశాను. ప్రస్తుతానికి సగంపైనే బూజుతెగులు, ఎండు తెగులుతో ఎండిపోయింది. ఉన్న అరకొర పంటలో సైతం వర్షం రాకతో బుడ్డలు వస్తాయో రావో అన్న సందేహాలు నెలకొని ఉన్నాయి.

- విశ్వనాథ్‌నాయుడు, రైతు, నారాయణపల్లి

ప్రభుత్వం ఆదుకోవాలి



పప్పుశనగపంట ఈ ఏడాది ఆశాజనకంగా ఉందని, తెగుళ్లు రాకుండా నాలుగు సార్లు క్రిమిసంహారక మందులు పిచికారీ చేశా. కానీ వర్షం దెబ్బతో పదిరోజుల నుంచి పంట స్వభావం మారిపోయింది. ఎండలు లేక పంట తెగుళ్ల బారినపడి కుళ్లిపోతోంది. సుమారు 10ఎకరాల్లో పంట సాగుచేశా. పెట్టిన పెట్టుబడి కూడా దక్కే అవకాశాలు లేవు. ప్రభుత్వం స్పందించి శనగ రైతులను ఆదుకోవాలి.

- చౌదరి, రైతు నారాయణపల్లి

దళారుల మాటలు నమ్మకండి

- ప్రతిభ ఆధారంగానే ప్రభుత్వ ఉద్యోగాలు
- జిల్లా ఎస్పీ జగదీష్


పీటీసీలో కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షల ఏర్పాట్లపై అధికారులకు సూచనలు ఇస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలు ఇప్పిస్తామని ఆశ కల్పించే దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. పీటీసీ మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించారు. ప్రభుత్వ ఉద్యోగాలు ఎప్పుడూ ప్రతిభ ఆధారంగానే వస్తాయన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఈ ప్రక్రియలో వాడుతుండటం వలన ఎక్కడా అక్రమాలకు తావుండదనే విషయాన్ని గుర్తించాలన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఎవరైనా మోసం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అభ్యర్థులు దేహదారుఢ్య పరీక్షలకు బాగా సాధన చేసి రావాలని సూచించారు.

అభ్యర్థులకు నిబంధనలు ఇలా..

ఈనెల 30 నుంచి జనవరి 17వరకు జరిగే ఈవెంట్స్‌కు హాజరయ్యే అభ్యర్థులు తమ అడ్మిట్‌కార్డులో నిర్దేశించిన తేదీల్లో ఉదయం 5గంటలకు స్థానిక నీలం సంజీవరెడ్డి మైదానంలో హాజరు కావాలి. తమతో పాటు అడ్మిట్ కార్డ్, స్టేజ్-1, స్టేజ్-2, అప్లికేషన్ కాపీలు, అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురావడంతో పాటు ఒక సెట్ అటెస్టెడ్ జిరాక్స్ కాపీలను తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలి. ఈవెంట్స్ ఉన్న అభ్యర్థులు అనంతపురం పీటీసీ తూర్పు గేటు నుంచి ప్రవేశించాలి.

- అభ్యర్థులతో పాటు ఎవరైనా వెంట వచ్చినా పీటీసీకి తూర్పున ఉన్న రహదారిపై ట్రాఫిక్ ఆంక్షలు ప్రారంభమయ్యే పాయింట్ వద్దే ఆగిపోవాలి. ఈవెంట్స్ జరిగే ప్రదేశానికి అనుమతి ఉండదు. అభ్యర్థి ఒక్కరు మాత్రమే ఈవెంట్స్ ప్రదేశానికి రావాల్సి ఉంటుంది.
- ఈనెల 30న తెల్లవారుజామున 4గంటల నుంచి జనవరి 17వరకు పీటీసీకి తూర్పున ఉన్న రైల్వేట్రాక్ పక్కన ఉన్న రహదారిపై ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయి. ఎలాంటి రాకపోకలు ఉండవు. ఈవెంట్స్ ముగిసే వరకు అన్ని రోజుల్లోనూ పోలీసులు ఈ ఆంక్షలు అమలు చేయనున్నారు.
- రాంనగర్, లక్ష్మీనగర్ మిట్టల మీదుగా మొదటి, రెండో, మూడో తదితర రోడ్లకువెళ్లే వాహనదారులు లక్ష్మీనగర్ నాగులకట్ట నుంచి సంజీవరెడ్డి బిల్డింగ్ సర్కిల్, జన్మభూమి రోడ్డుల మీదుగా నడిమివంక మీదుగా వెళ్లాలి.
- మొదటి, రెండో, మూడో తదితర రోడ్ల నుంచి రాంనగర్, లక్ష్మీనగర్, రహమత్‌నగర్ రైల్వే బ్రిడ్జి వైపు వెళ్లే వాహనదారులు పీటీసీ ఉత్తరం వైపునున్న సర్వీసురోడ్డు ద్వారా నడిమివంక, జన్మభూమి రోడ్డు, సంజీవరెడ్డి బిల్డింగ్ సర్కిల్ మీదుగా లక్ష్మీనగర్ నాగులకట్ట నుంచి వెళ్లాలి.

పోలీసుల ఓవరాక్షన్

- బూతులు తిడుతూ కాలితో తన్నుతూ...
- డ్రింకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తిపై దాడి


హేమకుమార్‌పై దాడి చేస్తున్న పోలీసులు

అనంతపురం క్రైం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): నగరంలో పోలీసులే ఓ వ్యక్తిపై దాడికి పాల్పడ్డారు. పత్రికల్లో రాయలేని పదాలతో దూషిస్తూ బూటు కాళ్లతో తన్నారు. ఇదంతా అనంతపురం ట్రాఫిక్ సీఐ సమక్షంలోనే జరగడం గమనార్హం. ఈ దృశ్యాలన్నీ సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి.

ఏం జరిగిందంటే...

ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం రాత్రి నగరంలోని క్లాక్‌టవర్ ఎదుట ట్రాఫిక్ సీఐ రఘుప్రసాద్ ఆధ్వర్యంలో డ్రంకెన్ డ్రైవ్ చేపట్టారు. నగరానికే చెందిన హేమకుమార్ బైక్‌లో వస్తూ పట్టుబడ్డాడు. టెస్ట్ చేశాక జరిమానా విధించారు. కొందరిని వదిలేస్తారు మాలాంటి వాళ్లను పట్టుకుంటారని ఆ సమయంలో హేమకుమార్ పోలీసులనుద్దేశించి వ్యంగ్యంగా మాట్లాడినట్లు తెలుస్తోంది. దీంతో ట్రాఫిక్ పోలీసులు రెచ్చిపోయారు. లం..కొడకా మమ్మల్నే మాట్లాడతావా అంటూ దాడి చేశారు. పిడిగుద్దులు గుద్దారు. బూతులు తిడుతూ బూటు కాలితో తన్నారు. ట్రాఫిక్ పోలీసులు బాబు, రాజేష్, రమేష్ తదితరులు హేమకుమార్‌పై దాడికి దిగారు. ఇదంతా సీఐ సమక్షంలో జరగడం విమర్శలకు తావిచ్చింది. సిబ్బందిలో ఒకరు కొట్టకండి. స్టేషన్‌కు తీసుకెళ్దామన్నా పట్టించుకునే పరిస్థితిలో లేకుండా పోలీసులు చితకబాదారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లోనూ కౌన్సెలింగ్ ఇచ్చినట్లు సమాచారం. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీన్ని వీక్షించిన పలువురు పోలీసుల తీరును తీవ్రంగా విమర్శిస్తున్నారు.

పోక్సో కేసులు.. ఇద్దరి అరెస్టు

గార్లదిన్నె, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొప్పలకొండ గ్రామానికి చెందిన యువకుడు సుధీర్‌పై శనివారం రాత్రి పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషా తెలిపారు. ఆయన తెలిపిన మేరకు కొప్పలకొండ గ్రామానికి చెందిన సుధీర్ గ్రామంలో వ్యవసాయ పనులు చేసుకునేవాడు. అయితే మండలంలోని మరో గ్రామానికి చెందిన బాలికతో ఇతడికి పరిచయం ఉంది. ఈ నేపథ్యంలో రెండు రోజుల కిందట సుధీర్ ఆమెను ఇంటి నుంచి తీసుకెళ్లాడు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు యువకుడిని శనివారం రాత్రి అరెస్ట్ చేసి పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గుత్తి ఆర్ఎస్‌లో..: గుత్తిఆర్ఎస్‌కు చెందిన యువకుడు వడ్డె అనిల్‌కుమార్‌ను పోక్సో కేసులో అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. గత నెల 24న గుత్తి ఆర్ఎస్‌లో బాలికను అపహరించిన కేసులో నిందితుడిపై అనిల్‌కుమార్‌పై కేసు నమోదు చేశారు. నిందితుడిని శనివారం గుత్తి ఆర్ఎస్‌లోని రైల్వేస్టేషన్ సమీపం వద్ద అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు అవసరం


వేపరాలలో అవగాహన కల్పిస్తున్న ఉద్యానశాఖ అధికారి ప్రతాప్‌రెడ్డి

పుట్టపర్తి రూరల్/గాండ్లపెంట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జిల్లాలో మామిడితోటలు మంచి పూతకు వచ్చే సమయమని, కాబట్టి రైతులు సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారి చంద్రశేఖర్ శనివారం ఓ ప్రకటనలో సూచించారు. అలాగే గాండ్లపెంట మండలంలోని జీన్లకుంట, వేపరాల పంచాయతీల్లో మామిడి రైతులకు ఉద్యానశాఖ డివిజన్ అధికారి ప్రతాప్‌రెడ్డి శనివారం అవగాహన కల్పించారు. పూత లేదా పూత మొగ్గలు తొందరగా ఒకేసారి రావడానికి 13:0:45, 7 గ్రాములు ప్లస్ ఏదేని సూక్ష్మధాతువు రెండు గ్రాములు నుంచి మూడు గ్రాములు ఒకలీటరు నీటితో కలిపి పిచికారి చేయాలన్నారు. ఇదివరకే 13:0:45 పిచికారి చేసిన రైతుకు 0:0:50 మూడు గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి స్ప్రే చేయాలన్నారు. తేనే మంచు పురుగు అగుపిస్తే తోటలో ఇమిడాక్లోప్రిడ్ - 0.3 ఎంఎల్ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. రాత్రిపూట ఉష్ణోగ్రతలు తగ్గడం వలన బూడిద తెగులు సోకే అవకాశం ఉందన్నారు. వర్షాలుపడి ఆగిపోయినందున పూతమొగ్గలపై మంచు ఏర్పడం పూతనల్లగా మారిపోయి పిందెకట్టకుండా రాలిపోయే అవకాశముందన్నారు. హెక్సాకొనజోల్ రెండు ఎంఎల్ లేదా తయోక్సినేట్‌మిథైల్ ఒక గ్రాము 0.3ఎంఎల్ ఇమిడాక్లోప్రిడ్‌తో కలిపి ఒక లీటరు నీటితో పిచికారి చేయాలన్నారు. జనవరి మొదటివారం వరకు కూడా పూమొగ్గలు రానట్లైతే ఒకసారి తేలికపాటి నీటి తడి ఇవ్వాలన్నారు. డ్రిప్ సౌకర్యం ఉన్నవారు డ్రిప్ ద్వారా 0:0:50 అనే నీటిలో కరిగే ఎరువును 2.5 నుంచి మూడు కేజీలు ఒకసారి ఎకరాకు వదులుకోవాలన్నారు. ఈవిధంగా చేయడం వల్ల ప్రస్తుత వాతావరణంలో మామిడిలో నష్టనివారణ చేయవచ్చన్నారు.

టమోటా కిలో రూ.11

అనంతపురం రూరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.11తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శనివారం 900 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.8, కనిష్ఠ ధర రూ. 5 పలికినట్లు ఆయన తెలిపారు.

సంక్షిప్తం

భక్తిశ్రద్ధలతో శనిత్రయోదశి



శనైశ్చరస్వామికి పూజలు చేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): శనిత్రయోదశిని పురస్కరించుకుని శనివారం సాయంత్రం నగరంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శారదానగర్‌లోని శివబాలయోగి ఆశ్రమంలో శనైశ్వరుడికి తైలాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. మహామంగళహారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం చేశారు. ఆలయ కార్యవర్గం, భక్తులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుకు విరాళం



విరాళం అందజేస్తున్న నారాయణమ్మ

అనంతపురం అర్బన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వాల నమోదు కోసం 28వ డివిజన్ అశోక్‌నగర్‌కు చెందిన టీడీపీ నాయకురాలు నారాయణమ్మ, నాయకుడు గురులు రూ.50వేలు విరాళం అందజేశారు. టీడీపీ అర్బన్ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌కు వారు రూ.50వేలు విరాళం అందజేశారు. వారిని ఎమ్మెల్యే అభినందించారు. నాయకులు బుగ్గయ్య చౌదరి, రాయల్ మురళి, సరిపూటి రమణ, నారాయణస్వామి యాదవ్, సుధాకర్ యాదవ్, పరమేశ్వరన్, పీఎల్ఎన్ మూర్తి, లక్ష్మీనరసింహ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వస్త్రాలు వితరణ

అనంతపురం కల్చరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని నిత్యసురభి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం కోవూర్‌నగర్ లోని ఎయిమ్ ఫర్ సేవ ఆశ్రమంలోని విద్యార్థులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. తొలుత విద్యార్థులకు అన్నదానం చేశారు. అనంతరం ట్రస్టు చైర్‌పర్సన్ నిర్మలామురళి చేతులమీదుగా విద్యార్థులకు నూతన వస్త్రాలు అందజేశారు. ట్రస్టు సభ్యులు సత్యాత్మానంద, కవీన్ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

ఆకుల రఘురామయ్యకు సన్మానం



జ్ఞాపిక అందుకుంటున్న రఘురామయ్య

నార్పల, డిసెంబరు 28 (ఆంధ్ర జ్యోతి): ప్రపంచ తెలుగు రచయితల సంఘం కాకరపర్తి భావ నారాయణ, కేబీఎస్ కళాశాల సంయుక్తంగా నిర్వహించిన ప్రపంచ తెలుగు రచయితల మహాసభల ప్రతినిధుల కవి సమ్మేళనంలో అనంతపురం జిల్లాకు చెందిన ఆకుల రఘురామయ్యను ఘనంగా సన్మానించారు. శనివారం నిర్వహించిన కవి సమ్మేళనంలో కడుపుబ్బా నవ్వుకో అనే శీర్షికతో ఆయన చేసిన కవితా గానం ప్రశంసలు అందుకుంది. తమిళనాడు రాష్ట్రం హోసూరు ఎంపీ కే గోపినాథ్ చేతులమీదుగా ప్రశంసా పత్రం, జ్ఞాపిక, మెడల్‌తో ఆయనను సన్మానించారు.

చీటింగ్ కేసు నమోదు

అనంతపురం క్రైం,డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): చెక్కులు బ్యాంకులో చెల్లలేదనే విషయంపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం చీటింగ్ కేసు నమోదైంది. వేణుగోపాల్ నగర్‌కు చెందిన రామచంద్రారెడ్డి తనకు రూ.10లక్షల విలువైన రెండు చెక్కులు ఇచ్చారని, అవి చెల్లలేదని శ్రీనగర్ కాలనీకి శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

డిఫెన్స్ మద్యం స్వాధీనం

అనంతపురం అర్బన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని భైరవనగర్ 11వ క్రాస్‌లో ఓ వ్యక్తి నుంచి 59 డిఫెన్స్ ఫుల్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ విజిలెన్స్ అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి ఆదేశాల మేరకు శనివారం ఎక్సైజ్ విజిలెన్స్ ఏఈఎస్ శ్రీరామ్, సీఐ అన్నపూర్ణ, ఎస్ఐ హరికృష్ణ దాడులు చేశారు. భైరవనగర్ 11వ క్రాస్ వద్ద ఆ వ్యక్తి డిఫెన్స్ మద్యం బాటిళ్ల ను విక్రయించేందుకు వేచిఉండగా ఎక్సైజ్ పోలీసులుమాటు వేసి పట్టుకున్నారు. డిఫెన్స్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. డిఫెన్స్ మద్యం ఎక్కడి నుంచి తీసుకొచ్చా రనే కోణంలో విచారణ చేస్తున్నట్లు ఏఈఎస్ శ్రీరామ్ పేర్కొన్నారు. దాడుల్లో హెడ్ కాని స్టేబుళ్లు చలపతి, ఫణీంద్ర, కానిస్టేబుళ్లు నారాయణస్వామి, సందీప్, మారుతీ, పుష్పలత పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

శింగనమల, డిసెంబరు 28 (ఆంధ్ర జ్యోతి): నాయీ బ్రాహ్మణలకు దేవదాయ భూములలోనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలను దేవదాయ ధర్మాదాయ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డిని రాష్ట్రనాయీ బ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ ఎం ఆదినారాయణ కోరారు. డైరెక్టర్లు ఎం. ఆదినారాయణ, పి.విజయ్‌కుమార్, కండియాల కొండన్న శనివారం విజయవాడలో మంత్రిని కలిశారు. ఎస్సీ నియోజకవర్గం అయిన శింగనమలలో 1982లో దేవదాయ భూములను ఆశాఖ అధికారులు ఇళ్ల స్థలాలకు వేలం వేశారన్నారు. రోడ్డుకు పక్కనే ఉన్న స్థలాలు వేలంలో పోగా, శ్మశాన వాటిక అక్కడే ఉండడంతో మిగిలిన స్థలాలు అలాగే ఉన్నాయని వినతి పత్రం అందజేశారు.

ప్రయాణికులకు పార్కింగ్ కష్టాలు

- నష్టాలు భరించలేక మూసివేత దిశగా స్టాండ్లు
- వెలుపల పార్క్ చేస్తే జరిమానాలు



ఎంట్రీ గేట్ వద్ద స్టాండ్ నిండిపోవడంతో బయట పార్క్ చేసిన దృశ్యం

అనంతపురం కల్చరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండ్లలో ప్రయాణికులకు వాహన పార్కింగ్ కష్టాలు తొలిగేనా..! అనే అనుమానాలు వాహనదారుల్లో వ్యక్తమవుతున్నాయి. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు మీదుగా రోజుకు దాదాపు 85వేల మంది ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఏదైనా పనిపై ఊళ్లకు వెళ్లొచ్చేవారు, వేరే ఊళ్లలో డ్యూటీలకు బస్సుల్లో వెళ్లేవారు రోజుకు దాదాపు మూడు వేల మంది తమ ద్విచక్ర వాహనాలను బస్టాండు ఆవరణలోని పార్కింగ్ స్టాండ్లలో ఉంచి వెళ్తుంటారు. ఇందుకోసం బస్టాండు పరిధిలో గతంలో నాలుగు స్టాండ్లు ఉండేవి. దాదాపు రెండేళ్ల క్రితం ఒకటి తగ్గిపోగా ప్రస్తుతం మూడు ఉన్నాయి. ఈ ఏడాది జూన్ 12న పార్కింగ్ స్టాండ్ల నిర్వహణ కోసం నిర్వహించిన వేలం టెండర్ల ప్రక్రియలో ఆర్ఎం కార్యాలయం పక్కనే ఉన్న పెద్ద పార్కింగ్ స్టాండ్‌ను జీఎస్టీతో కలిపి నెలవారీ అద్దె రూ. 4.05 లక్షలకు సుంకన్న అనే వ్యక్తి, పక్కనే ఉన్న మినీ స్టాండ్‌ను రూ. 60 వేలకు వెంకటరమణ, బస్టాండు ఎంట్రీ గేట్‌లో ఉన్న పార్కింగ్ స్టాండ్‌ను రూ.83వేలకు వెంకటరామయ్య ఐదేళ్ల అగ్రిమెంట్‌తో దక్కించుకున్నారు. అయితే ఈ నెల 8వ తేదీన సుంకన్న అనే వ్యక్తి నష్టాలు కారణం చూపుతూ తన టెండరును రద్దు చేసుకుని స్టాండ్‌ను మూసివేశాడు. గతంలో ఇదే స్టాండు రూ. 1.50 లక్షలకు టెండరు పోగా ఈ ఏడాది మాత్రం జీఎస్టీ కాకుండా రూ. 3.35 లక్షలు పలకడంతో నిర్వాహకులు నష్టపోవాల్సి వస్తోంది. నిబంధనల మేరకు అన్ని స్టాండ్లలోనూ పార్కింగ్ ఫీజు ఒకే రకంగా వసూలు చేయాల్సి ఉండడం, నష్టాలను అధిగమించేందుకు పార్కింగ్ ఫీజు పెంచే వెసులుబాటు లేకపోవడంతో టెండరు గడువు ముగియకనే నిర్వాహకులు స్టాండ్లను మూసివేస్తున్నారు. దీంతో బస్టాండుకు వచ్చే ద్విచక్ర వాహనదారులకు పార్కింగ్ కష్టాలు మొదలయ్యాయి.

జరిమానాలతో సతమతం

దాదాపు 550 వాహనాల పార్కింగ్ సామర్థ్యం కలిగిన స్టాండ్ మూతపడడంతో, బస్టాండుకు వచ్చే ద్విచక్ర వాహనదారులు తమ వాహనాలను ఎక్కడ పార్కింగ్ చేయాలో అర్థంకాక సతమతమవుతున్నారు. ప్రస్తుతానికి ఉన్న రెండు స్టాండ్లు వాహనాలతో నిండిపోవడంతో వాహనదారులు గత్యంతరం లేక స్టాండ్ల వెలుపలే పార్కింగ్ చేసి వెళుతున్నారు. మరికొందరు బస్టాండు వెనుకభాగాన రిజర్వేషన్ కౌంటర్ వెలుపల పార్కింగ్ చేస్తున్నారు. ఇలాంటివారిపై ఆర్టీసీ భద్రతా సిబ్బంది జరిమానాలతో విరుచుకుపడుతున్నారు. ఇలాంటి తరుణంలో తాత్కాలికంగా అయినా పెద్ద స్టాండ్‌ను తెరిపించి సమస్యను పరిష్కరించాల్సిన ఆర్టీసీ అధికారులు ఆ మేరకు చర్యలు చేపట్టడం లేదు. మరోవైపు నిర్వాహకులు వద్దని నివారిస్తున్నా వాహనదారులు తమ బైక్‌లను స్టాండ్ల వెలుపుల పార్కింగ్ చేసి వెళుతున్నారు. దీంతో స్టాండ్ల నిర్వాహకులపై సైతం అధికారులు జరిమానాలు విధిస్తున్నారు తప్ప ప్రత్యామ్నాయం చూపడం లేదు. పెద్దస్టాండ్ మూతపడి 20 రోజులు గడుస్తున్నా కొత్త టెండర్లు పిలవకపోవడంతో పాటు కనీసం తాత్కాలిక చర్యలు చేపట్టకపోవడంపై ప్రయాణికులు నిట్టూరుస్తున్నారు.



జరిమానా విధిస్తున్న ఆర్టీసీ భద్రతా సిబ్బంది

వైసీపీ దొంగ నాటకాలు ఇకనైనా ఆపాలి

- ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ఆడుతున్న దొంగ నాటకాలను ఇప్పటికైనా ఆపాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. టీడీపీ అర్బన్ కార్యాలయంలో శనివారం పలువురు టీడీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. గత వైసీపీ పాలనలో జగన్ అవినీతి మూలంగా ఏపీ ప్రజలపై రూ.1.29 లక్షల కోట్ల విద్యుత్ భారం పడిందన్నారు. 2014లో చంద్రబాబునాయుడు పాలనలో ప్రారంభమయ్యే నాటికి 22.5 మిలియన్ యూనిట్ల లోటుతో విద్యుత్ ఉండేదని, అలాంటి పరిస్థితుల నుంచి మిగులు విద్యుత్ ఉండేలా సీఎం చంద్రబాబు చేశారన్నారు. వైసీపీ అధికారం చేపట్టిన నాటికి మిగులు విద్యుత్ ఉండగా, జగన్‌రెడ్డి అవినీతి, కక్షసాధింపు చర్యలతో విద్యుత్ రంగం దెబ్బతినేలా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు విద్యుత్ చార్జీలు పెంచారంటూ నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. గాడి తప్పిన వ్యవస్థలను సీఎం చంద్రబాబు చక్కబెడుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బుగ్గయ్య చౌదరి, రాయల్ మురళీ, పోతుల లక్ష్మీనరసింహులు, పరమేశ్వరన్, లక్ష్మీనరసింహ, రామలింగ తదితరులు పాల్గొన్నారు.

పీఎం ఆవాస్ యోజనను సద్వినియోగం చేసుకోండి

పట్టణ ప్రాంతాల్లో నివశించే పేదల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో చేపడుతున్న ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ సూచించారు. నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆయన శనివారం హౌసింగ్ పీడీ శైలజ, నగర పాలక సంస్థ కమిషనర్ రామలింగేశ్వరరెడ్డి, డీఈ మధుసూదన్‌రెడ్డితో ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించారు. అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి, త్వరగా మంజూరు ఉత్తర్వులు జారీ చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.

కళాకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

- ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ



గుమ్మడి గోపాలకృష్ణను సత్కరిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా రంగస్థల కళాకారుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంతోపాటు వారి సంక్షేమానికి కృషి చేస్తానని ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని లలితకళా పరిషత్ మాజీ కార్యదర్శి గాజుల నారాయణస్వామి ఆరో వర్ధంతిని పురస్కరించుకుని శనివారం సాయంత్రం పరిషత్ ఆవరణలో శ్రీకృష్ణ రాయబారం నాటక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి గుమ్మడి గోపాలకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై నారాయణస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నాటక అకాడమీ చైర్మన్ బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి అనంతపురం వచ్చినను పరిషత్ కార్యవర్గంతోపాటు అనంత కళాకారులు ఘనంగా సత్కరించారు. టీజీవీ కళాక్షేత్రం పత్తి ఓబులయ్య, సంగాల నారాయణస్వామి, పరిషత్ ఉపాధ్యక్షుడు రామగోవింద్‌సాగర్, అస్లాం బాషా, సురభి ఆనంద్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై విద్యుత్ భారం వైసీపీ పాపమే

- ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం



రామగిరి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉండగా రైతుల గురించి ఏ మాత్రం పట్టించుకోకుండా, విద్యుత్‌రంగాన్ని సర్వనాశనం చేసిన వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఇప్పుడు మొసలి కన్నీరుకారుస్తున్నారని ఎమ్మెల్యే పరిటాలసునీత విమర్శించారు. మండలంలోని వెంకటాపురంలో శనివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్యుత్ చార్జీలపై వైసీపీ శుక్రవారం నిర్వహించిన నిరసనను తీవ్రంగా ఖండించారు. వారు చేపట్టిన నిరసన ఒక ప్లాప్‌షోను తలపించిందని, ప్రజలే కాకుండా సొంతపార్టీ నాయకులు కూడా ఈ నిరసనను పట్టించుకోలేదన్నారు. వైసీపీ అధినేత జగన్‌కు గానీ, ఆ పార్టీ నాయకులకు గానీ విద్యుత్‌చార్జీల గురించి మాట్లాడే నైతిక హక్కులేదన్నారు. వైసీపీ హయాంలో సీఎం హోదాలో జగన్ పెంచిన విద్యుత్‌చార్జీల పట్ల వారే నిరసనకు పిలుపు నివ్వడం సిగ్గుచేటని పేర్కొన్నారు. ఐదేళ్లలో రైతుల గురించి ఏనాడు మాట్లాడని వైసీపీ నేతలు ఇప్పుడు రోడ్లు ఎక్కడం సిగ్గుచేటన్నారు. మండలంలోని రైతులకు డ్రిప్, స్ప్రింకర్లు సబ్సిడీపై యంత్రపరికరాలు అందిస్తున్నామన్నారు. వాస్తవాలు విడిచి వైసీపీ కరపత్రిక కూటమి ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తోందన్నారు. దీన్ని ప్రజలే గమనించి వైసీపీకి తగిన బుద్ధి చెబుతారన్నారు.

వైసీపీ డ్రామాలను ప్రజలు నమ్మరు

- అర్బన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్తు చార్జీలపై వైసీపీ నాయకులు ఆడుతున్న డ్రామాలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని, వైసీపీ నాటకాలను త్వరలో బహిర్గతం చేస్తామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, అర్బన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే వైసీపీ నాయకులు లేనిపోని విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం, జగన్‌రెడ్డి చేసిన పాపాలే విద్యుత్‌చార్జీల పెంపునకు కారణమని, వెంటనే ఇది గ్రహించి జగన్ ఇంటి ఎదుట వైసీపీ నేతలు ధర్నా చేయాలని హితవుపలికారు. ప్రజలు ఇప్పటికే బుద్ధి చెప్పినా వైసీపీ తీరు మారలేదని, త్వరలో జగన్ పార్టీ కనుమరుగుకావడం ఖాయమని జోస్యం చెప్పారు.

సంఘటితమై సాధిద్దాం : మాల జేఏసీ

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మాలలందరూ సంఘటితమైతేనే హక్కులను సాధించగలమని మాల జేఏసీ నాయకులు పేర్కొన్నారు. స్థానిక ఎన్‌జీఓ హోంలో శనివారం మాలల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జేఏసీ నాయకులు యాట ఓబులేసు, నుగమంచి శ్రీనివాసులు, సుందరబాబు హాజరై మాట్లాడారు. ఎస్సీ సామాజికవర్గ ప్రజలను కులాలువారీగా విభజించి వర్గీకరణ రాజకీయం చేస్తున్నారని మండి పడ్డారు. దీనిని వ్యతిరేకిస్తూ ఫిబ్రవరి 23న కర్నూలులో రాయలసీమ మాలల యుద్ధ గర్జన సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి గ్రామంనుంచి మాలలందరూ తరలివచ్చి వర్గీకరణపై నినదించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మాధవస్వామి, డాక్టర్ కోట్ల, గంగాధర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యాప్రవేశాలను వర్సిటీలే ర్వహించాలి

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యాప్రవేశాల ప్రక్రియను ఆయా విశ్వవిద్యాలయాలే సొంతంగా నిర్వహించాలని ఏపీ స్టూడెంట్స్ జేఏసీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శనివారం ఎస్కేయూ రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌బాబును కలిసిన రాష్ట్ర అధ్యక్షులు హేమాద్రి, జిల్లా అధ్యక్షుడు అమర్‌యాదవ్ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(సెట్) పేరుతో ప్రవేశాల ప్రక్రియను సెంట్రలైజ్డ్ చేయడం తో ప్రవేశాల శాతం గణనీయంగా పడిపోయి వర్సిటీలు నిర్వీర్యం దశకు చేరాయని పేర్కొన్నారు.

ఎంపీడీఓపై దాడి దుర్మార్గం

- జిల్లా వ్యాప్తంగా ఎంపీడీఓ కార్యాలయాల వద్ద నిరసన



అనంతపురం ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

అనంతపురం విద్య, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : అన్నమయ్య జిల్లాలో డ్యూటీలలో ఉన్న గాలివీడు ఎంపీడీఓ జవహర్‌బాబుపై వైసీపీ నేత దాడి చేయడం దుర్మార్గమని ఎంపీడీఓలు, మిని స్టీరియల్ ఉద్యోగులు, నాలుగో తరగతి ఉద్యోగులు, ఇతర పంచాయతీరాజ్ సిబ్బంది ఖండించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అన్ని ఎంపీడీఓ కార్యాలయాల వద్ద శనివారం ఎంపీడీఓలు, ఇతర సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతపురం, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, బెళుగుప్ప, పెద్దపప్పూరు ఇలా అన్ని మండలాల ఎంపీడీఓ కార్యాలయాల వద్ద ఉద్యోగులు భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఎంపీడీఓలు దాడిని తీవ్రంగా ఖండించారు. విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగిపై దాడి చేయడం సరికాదని పేర్కొన్నారు. దాడి చేసిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసు కోవాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వారు కోరారు. చికిత్స పొందుతున్న బాధిత ఎంపీడీఓ జవహర్‌బాబును డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కడప రిమ్స్ ఆసుపత్రిలో పరామర్శించడం ఆనందంగా ఉందన్నారు. ఇది యావత్ పంచాయతీరాజ్ సిబ్బందిలో ధైర్యం పెంచేలా చేసిందన్నారు.

దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి

- పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య డిమాండ్

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గాలివీడు ఎంపీడీఓ జవహర్ బాబుపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వర్ల శంకర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ కార్యాలయంపై దాడికి వెళ్లి, తాళాలు వేసి, అధికారులపై భౌతిక దాడులకు పాల్పడ్డారన్నారు. ఇక ప్రభుత్వ ఉద్యోగులకు భద్రత ఎలా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు తగిన రక్షణ కల్పించాలన్నారు.

బీసీ భవన్ ఏర్పాటుకు చొరవ చూపండి : సాకే నరేష్

అనంతపురం అర్బన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో బీసీ భవన్ ఏర్పాటుకు చొరవ చూపాలని బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు సాకే నరేష్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌ను కోరారు. ఈ మేరకు శనివారం టీడీపీ అర్బన్ కార్యాలయంలో ఎమ్మెల్యేకి వినతి పత్రం అందజేశారు. నాయకులు నారాయణస్వామి, డీకే రామలింగ, శ్రీనివాసులు, మనోజ్ , కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఓబన్న జయంతిపై త్వరగా ప్రకటించాలి

- కుంచెపు వెంకటేష్

అనంతపురం అర్బన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధులు వడ్డె ఓబన్న జయంతిని జనవరి 11వతేదీన ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నట్లు తక్షణమే అధికారిక ఉత్తర్వులు జారీ చేయాలని ఉమ్మడి అనంత జిల్లా వడ్డెర్ల సంఘం అధ్యక్షుడు కుంచెపు వెంకటేష్ కోరారు. స్థానిక శ్రీనివాస్‌నగర్‌లోని వడ్డెర్ల సంఘం కార్యాలయంలో ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. ఇదివరకే సంఘం తరఫున రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వడ్డే సుధాకర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధిగణపతి మహా యాగం ప్రారంభం



పూజలందుకుంటున్న గణనాథుడు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : శ్రీ జ్ఞానపీఠం, గుహానంద మండలి సంయుక్త ఆధ్వర్యంలో చేపడుతున్న వార్షిక యాగంలో భాగంగా శనివారం రెండో రోడ్డులోని శ్రీ జ్ఞానపీఠంలో సిద్ధి గణపతి మహాయాగాన్ని శాస్త్రోక్తంగా ప్రారంభించారు. పీఠం ఆవరణలో గణపతి పూజ, గోపూజ, మహాసంకల్పం, కలశస్థాపన తోపాటు గణపతి ఆవరణార్చన, సిద్ధిగణపతి యాగం నిర్వహించారు. ఇదే సమయంలో గణపతి, అధర్వ హోమాలు చేశారు. మధ్యాహ్నం పెద్దఎత్తున అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో విద్యానందనాథస్వామి, గోటేటి శ్రీనివాసరావు, లక్ష్మి, మధుసూదన్‌రావు, పీఠం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



సిద్ధిగణపతి మహాయాగం నిర్వహిస్తున్న దృశ్యం

పంటలను కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించండి

- వ్యవసాయశాఖ ఏడీ

గార్లదిన్నె, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేసిన ప్రత్యామ్నాయ పంటలను ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని ఏడీఏ రవి సూచించారు. మండల పరిధిలోని కోటంక గ్రామంలో సాగు చేసిన ప్రత్యామ్నాయ పంటలను శనివారం వ్యవసాయ అధికారి సోమశేఖర్‌తో కలిసి ఏడీఏ రవి పరిశీలించారు. ప్రత్యామ్నాయ పంటలు సాగుచేసిన రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రా లను జనవరి మొదటి వారంలోనే ఏర్పాటు చేస్తుందని తెలిపారు.

ఏఓ నాగేంద్రకు ఘన సన్మానం



ఏఓ నాగేంద్రను సన్మానిస్తున్న జేడీ ఉమామహేశ్వరమ్మ తదితరులు

అనంతపురం అర్బన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక భూసార పరీక్షా కేంద్రంలో పనిచేస్తున్న వ్యవసాయాధికారి నాగేంద్ర ఈనెలాఖరులో పదవీ విరమణ చెందనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం స్థానిక కృషి భవన్‌లో ఆయనకు వీడ్కోలు సభ నిర్వహించారు. జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, వ్యవసాయాధికారుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వాసు ప్రకాష్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటకుమార్, కోశాధికారి శ్యామ్‌సుందర్‌రెడ్డి, భూసార పరీక్షా కేంద్రం ఏడీఏ రోజా పుష్పలత శాలువ కప్పి, పూల మాల వేసి ఘనంగా సన్మానించారు. ఏఓలు రాకేష్, బాలూనాయక్, శ్రీనాథ్‌రెడ్డి, ఉమా మహేశ్వరి, అర్చన, ఏఈఓ గంగులప్ప, జూనియర్ అసిస్టెంట్ సందీప్, సిబ్బంది పాల్గొన్నారు. వ్యవసాయ శాఖలో ఏఓ నాగేంద్ర చేసిన సేవలనువారు కొనియాడారు. ఆయనతో తమకున్న అనుబంధాన్ని పలువురు అధికారులు, సిబ్బంది పంచుకున్నారు. ఆయన విశ్రాంత జీవితం సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు.

మాజీ సైనికుల పాలీక్లినిక్ అధికారికి...

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు28 ఆంధ్రజ్యోతి : మాజీ సైనికుల పాలి క్లినిక్ అధికారి కల్నల్ రాజశేఖర్‌రావును మాజీ సైనికులు ఘనంగా సన్మానించారు. కల్నల్ రాజశేఖర్‌రావు బదిలీపై వెళ్తున్న సందర్భంగా శనివారం పాలిక్లినిక్ ఆవరణంలో ఆయనను మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షుడు కెప్టెన్ షేకన్న శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. సంఘం ప్రధాన కార్యదర్శి పట్నం ఉమామహేశ్వరరావు, కోశాధికారి తిమ్మారెడ్డి, సభ్యులు సిద్దన్న, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోరం లేక గంటన్నర ఆలస్యంగా సమావేశం




సమావేశంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

అనంతపురం రూరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): కోరం లేకపోవడంతో మండల స్థాయి సర్వసభ్య సమావేశం గంటన్నర ఆలస్యంగా ప్రారంభమైంది. గ్రామాల్లో సమస్యలపై చర్చించే తీరికి వారిలేనట్లు ఉందని విమర్శలు వెలువడ్డాయి. మండలంలో 36మంది ఎంపీటీసీలు ఉన్నారు. సమావేశం నిర్వ హణకు అవసరమైన సభ్యులు హాజరుకాకపోవడంతో శనివారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం గంటన్నర ఆలస్యంగా ప్రారంభమైంది. సభ్యుల కోసం ఎంపీడీఓ దివాకర్, ఎంపీపీ వరలక్ష్మి, జడ్పీటీసీ చంద్రకుమార్, ఈఓఆర్డీ వెంకటనాయుడు, ఎంఈఓ వెంకటస్వా మి, పీఆర్ జేఈ శేషయ్య, ఏపీఎం రవి తదితరులు ఎదురు చూడటం కనిపించింది. సమావేశం ప్రారంభమైన తరువాత కూడా 15మంది మించి రాలేదు. వారితోనే సమావేశాన్ని నిర్వహించారు.

ఆధార్ సమస్యలను పరిష్కరించాలి : సీపీఎం

అనంతపురం కల్చరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు ఎదుర్కొంటున్న ఆధార్ కార్డు సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప డిమాండ్ చేశారు. ఆధార్ కార్డు సమస్యల పరిష్కారాన్ని కోరుతూ శనివారం జిల్లాకేంద్రంలోని హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నల్లప్ప మాట్లాడుతూ... ప్రభుత్వ పథకాలకు ఆధార్ కార్డు తప్పనిసరి కాదని సుప్రీం కోర్టు చెబుతున్నా రాష్ట్ర ప్రభుత్వం ఆధార్ కార్డులను అప్డేట్ చేసుకోవాలని చెబుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారన్నారు. ప్రజలకోసం ఆధార్ సెంటర్లను విరివిగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, కార్యదర్శివర్గ సభ్యుడు ప్రకాష్, నగర కమిటీ సభ్యులు రాజు, ఎన్టీఆర్ శీన తదితరులు పాల్గొన్నారు.

ఒలంపియాడ్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో ఏజీఎం సుబ్బారెడ్డి

అనంతపురం విద్య, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఐఎన్‌టీఎస్‌ఓ ఒలంపియాడ్‌లో శ్రీచైతన్య విద్యార్థులు రెండో రౌండ్‌కు భారీగా అర్హత సాధించినట్లు ఏజీఎం సుబ్బారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలోనే జిల్లా నుంచి మెజార్టీ విద్యార్థులు సత్తా చాటి, జిల్లాను ప్రథమస్థానంలో ఉంచారన్నారు. విద్యార్థుల అభినంద సభను శనివారం కమ్మభవన్ సమీపంలోని శ్రీచైతన్య స్కూల్‌లో నిర్వహించారు. అనంతరం ఏజీఎం మాట్లాడారు. నవంబర్ 11, 13 తేదీల్లో ఐఎన్‌టీఎస్‌ఓ మొదటి రౌండ్ పరీక్షలు నిర్వహించారన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి 7455 మంది పరీక్షలకు హాజరు కాగా 6345 మంది అనగా 85 శాతం విద్యార్థులు రెండో రౌండ్‌కు అర్హత సాధించారన్నారు. గణితం ఒలంపియాడ్‌లో 1768 మంది, ఇంగ్లీష్‌లో 1537 , సైన్స్‌లో 1323, జీకే, సోషల్‌లో 899, అర్థమెటిక్ ఒలంపియాడ్‌లో 818 మంది అర్హత సాధించారని తెలిపారు. ప్రిన్సిపల్ విశ్వనాథ్, ఇతర కో-ఆర్డినేటర్లు, డీన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

ఆంజనేయస్వామికి లక్ష తులసీ దళాల అలంకరణ



లక్ష తులసీదళాల అలంకరణలో నేమకల్లు ఆంజనేయస్వామి

బొమ్మనహాళ్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లులో వెలసిన అంజనేయస్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించి లక్ష తులసీ దళాలతో అలంకరించారు. అర్చకులు అనిల్‌కుమారాచార్యులు, సంతోష్‌కుమారాచార్యులు, పవన్‌కుమార్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారు జామున పూజలు నిర్వహించి తులసీ దళాలతో విశేషంగా అలంకరించారు. ఈ సందర్భంగా వందలాది మంది భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ సన్నిధిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఫైనాన్స్ కంపెనీలో బంగారం మాయం..?

ఉరవకొండ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ప్రముఖ గోల్డ్ లోన్ ఫైనాన్స్ కంపెనీలో బంగారం మాయమైన సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. వినియోగదారులు తాకట్టు పెట్టిన బంగారాన్ని డబ్బులు కట్టి విడిపించుకోవడానికి వెళ్లిన క్రమంలో బంగారు నగలు కనబడకుండా పోవడంతో అసలు విషయం బయటకు పొక్కింది. ఈ వ్యవహారంలో ఫైనాన్స్ కంపెనీకి చెందిన ఓ ఉద్యోగి ప్రమేయం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని గోల్డ్ లోన్ ఫైనాన్స్ కంపెనీ సిబ్బంది ప్రధాన కార్యాలయానికి సమాచరమివ్వడంతో అక్కడి నుంచి ఆడిటర్లు ఉరవకొండ బ్రాంచ్‌కు చేరుకుని ఆరాతీశారు. లక్షలు విలువ చేసే బంగారాన్ని ఓ ఉద్యోగి తన సొంత అవసరాల కోసం మాయం చేసి దానిని మరో చోట తాకట్టు డబ్బు తీసుకుని వాడుకున్నట్లు గుర్తించినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

ఉనికిని కాపాడుకోవడానికే వైసీపీ ఆందోళనలు

గుంతకల్లు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి పార్టీ కనుమరుగై పోతుందన్న భయంతో తన ఉనికిని కాపాడుకోవడానికి వైసీపీ విద్యుత్ ఆందోళన చేపట్టిందని టీడీపీ పట్టణాధ్యక్షుడు బండారు ఆనంద్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, సింగిల్ విండో సొసైటీ మాజీ అధ్యక్షుడు పాల మల్లికార్జున, మాజీ కౌన్సిలరు అంజితో కలిసి ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో జగన్ చేసిన పాప ఫలితమే విద్యుత్ సర్దుబాటు చార్జీల భారమని తెలిపారు. చేయడానికి ఏమీలేక జగన్ పాపాలను చంద్రబాబు నాయుడుకు చుట్టే కుయుక్తికి వైసీపీ పాల్పడుతోందని విమర్శించారు. విలేకరుల సమావేశంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు మత్రునాయక్ పాల్గొన్నారు.

బాబ్ మేళాలో 28 మంది ఎంపిక

గుంతకల్లుటౌన్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని న్యాక్ ట్రైనింగ్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్, జిల్లా ఎంప్లాయిమెంట్, సిడాప్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాబ్ మేళాలో 28 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ జాబ్ మేళాకు మూడు కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. 59 మంది ఇంటర్వ్యూలకు హాజరుకాగా 28మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాధికారి ప్రతాప్‌రెడ్డి, సిడాప్ జేడీఎం సూర్యనారాయణ పాల్గొన్నారు.

బైకులు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

గుత్తి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని అనంతపురం రోడ్డులో రెండు బైకులు ఢీ కొని ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. కల్లూరుకు చెందిన శ్రీనివాసులు తన బైక్‌పై గుత్తికి వస్తుండగా పట్టణ శివారులో రాగానే ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొంది. ఈ సంఘటనలో శ్రీనివాసులు తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

సదరం క్యాంపు నిలిపివేత

ఉరవకొండ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): సదరం క్యాంపు తాత్కాలికంగా నిలుపుదల చేసినట్లు ఉరవకొండ సీహెచ్‌సీ సూపరింటెండెంట్ వెంకటస్వామిచౌదరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు ఆపివేశామన్నారు. ప్రారంభించే తేదీలను తర్వాత ప్రకటిస్తామన్నారు.

డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం

తాడిపత్రి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చుక్కలూరు గ్రామానికి చెందిన డ్రైవర్ నరసింహ కుటుంబ సభ్యులకు అనంతపురం న్యూహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో శనివారం రూ.61,300 ఆర్థికసాయం అందజేసినట్లు సభ్యులు తెలిపారు. నెల రోజుల క్రితం నరసింహ రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. జిల్లా వ్యాప్తంగా డ్రైవర్ల సహకారంతో ఈ ఆర్థికసాయం అందజేసినట్లు న్యూహెచ్‌ఎంసీ జిల్లా అధ్యక్షుడు నరసింహ, నూర్‌బాషా, బాలకృష్ణ తదితరులు తెలిపారు.

పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలి

గుత్తి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): గర్భవతులు, బాలింతలకు అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా అందజేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ ఢిల్లీశ్వరి తెలిపారు. పట్టణంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో శనివారం గుంతకల్లుకు సంబంధించి అంగన్‌వాడీ కార్యకర్తలకు సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ సమయపాలన పాటించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఆర్వో ప్లాంట్లు మంజూరు చేయండి

రాయదుర్గం రూరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జుంజురంపల్లి, గ్రామదట్ల గ్రామాల్లో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆర్వో ప్లాంట్లను మంజూరు చేయాలని సర్పంచులు రాజశేఖర్‌రెడ్డి, వన్నూరుస్వామి కోరారు. శనివారం ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందించారు. ఎంపీ మాట్లాడుతూ త్వరలోనే రెండుగ్రామాలకు ఎంపీ నిధుల ద్వారా ఆర్వో ప్లాంట్లను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.



ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకు వినతిపత్రం ఇస్తున్న సర్పంచులు

విచారణతోనే సరిపెడతారా..?

● మాయమైన రికార్డులు ప్రత్యక్షం ● యాడికి ఎంపీడీఓ కార్యాలయంలో నిధుల దుర్వినియోగం ● చర్యలపై జాప్యం



యాడికి మండల పరిషత్ కార్యాలయం

యాడికి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో నిధుల దుర్వినియోగంపై ఎలాంటి చర్యలు చేపడతారో అని చర్చ కొనసాగుతోంది. అక్టోబరు నెల నుంచి ఈ నెల 19వరకు గుంతకల్లు డీఎల్‌డీఓ నుంచి జిల్లా పరిషత్ సీఈఓ వరకు విచారణ కొనసాగించారు. మూడునెలలకు పైగా దపదఫాలుగా విచారణ చేశారు. విచారణ పూర్తయిన నేపథ్యంలో నిధులు దుర్వినియోగానికి పాల్పడిన అధికారులపై ఎలాంటి చర్యలు చేపడతారనేది ప్రశ్నార్థకంగా మారింది. గత ప్రభుత్వంలో యాడికి ఎంపీడీఓగా కొండయ్య నియామకం జరిగినప్పుడు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా అనిల్‌కుమార్ ఉన్నారు. రెగ్యులర్ ఎంపీడీఓగా కొండయ్య వచ్చినప్పటికి అనిల్‌కుమార్ పెత్తనం చెలాయిస్తూ సీఎఫ్ఎంఎస్ ద్వారా నిధుల దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. 2019-20 నుంచి 2022-23 కాల వ్యవధికి సంబంధించి యాడికి మండల పరిషత్ నిధుల్లో సీనరేజస్ సెస్ కోట్ల రూపాయల్లో జమ అయి ఉన్నాయని, సదరు నిధులు నిబంధనలకు విరుద్ధంగా ఖర్చుచేశారని ఫిర్యాదు వెళ్లాయి. దీనిపై గుంతకల్లు డీఎల్‌డీఓ యాడికి ఎంపీడీఓ కార్యాలయంలో అక్టోబరు నెలలో విచారణ చేశారు. సాధారణ నిధులకు సంబంధించిన రికార్డులు, క్యాష్‌బుక్స్, వోచర్స్, వర్క్‌లిస్ట్ మండలపరిషత్‌లో ఆమోదించిన తీర్మానాలు విచారణ సమయంలో ఇవ్వలేదు. 2019-20లో సాధారణ నిధులకు సంబంధించిన క్యాష్‌బుక్ మాత్రమే విచారణలో చూపించినట్లు తెలిసింది. 2019-23కు సంబంధించిన ఎటువంటి రికార్డులు ఇవ్వలేదు. 2019-23 మధ్య కాలంలో రూ.3,54,23,290 సీఎఫ్ఎంఎస్ ద్వారా లావాదేవీ జరిపినట్లు విచారణలో తేల్చారు. 15 రోజులు సమయం ఇచ్చినా రికార్డులు ఇవ్వలేకపోయారని, అవి లేనందున పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించలేకపోయామని పేర్కొన్నారు. నివేదిక ఇచ్చిన తర్వాత గుర్తు తెలియని వ్యక్తి సదరు రికార్డుల మూటను తీసుకువచ్చి సంబంధిత విభాగం కార్యాలయంలోని కుర్చీలో పెట్టి వెళ్లినట్లు తెలిసింది. ఈ రికార్డులను ఎవరు తీసుకువచ్చారు? ఇన్నిరోజులు ఎవరి వద్ద ఉన్నాయి. నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు అందకపోయి ఉంటే ఈ గుట్టు బయటకు వచ్చేదా..? దీని వెనుక ఏమి జరిగిందనేది ఉన్నతాధికారులే నిగ్గు తేల్చాల్సి ఉంది. డిసెంబరు 5న అప్పటి ఎంపీడీఓ కొండయ్య, ఈఓపీఆర్‌డీ వెంకటేష్ విచారణకు హాజరయ్యారు. తమ వద్ద ఉన్న ఆధారాలను అధికారులకు అప్పగించారు. డిసెంబరు 19న అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అప్పటి ఇన్‌చార్జ్ ఎంపీడీఓ (ప్రస్తుతం కనగానపల్లి మండలం) అనిల్‌కుమార్‌ను, అప్పట్లో పనిచేసిన సూపరింటెండెంట్ శంకరరావు, జూనియర్ అసిస్టెంట్ గంగాధర్, సీనియర్ అసిస్టెంట్ మహబూబ్‌వలిని విచారణకు రావాల్సిందిగా జడ్పీ సీఈఓ నోటీసు ఇచ్చారు. విచారణ పూర్తయిన నేపథ్యంలో ఎటువంటి చర్యలు చేపడతారనేది ప్రశ్నార్థకంగా మారింది. రికార్డులు మాయంకావడం, నిధుల దుర్వినియోగం గుట్టు బయటపడడం, విచారణ నేపథ్యంలో అప్పట్లో పనిచేసిన అధికారుల మధ్య విభేదాలు వచ్చినట్లు తెలిసింది. అప్పట్లో ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా పనిచేసిన అధికారి రూ.4కోట్ల మేర అవినీతికి పాల్పడ్డాడని, దీనిపై విచారించి చర్యలు చేపట్టాలని అప్పట్లో పనిచేసిన జూనియర్ అసిస్టెంట్ జిల్లా కలెక్టర్‌కు, విజిలెన్స్ అధికారులకు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు ఫిర్యాదుచేసినట్లు సమాచారం.

ఆసుపత్రి ఏఓను సస్పెండ్ చేయాలి



ఆసుపత్రి ఎదుట ఏఓ దిష్టిబొమ్మతో ధర్నా చేస్తున్న దళిత సంఘాల నాయకులు

గుంతకల్లు టౌన్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బందిని వేధిస్తున్న ఏఓ రాంప్రసాద్‌పై సమగ్రంగా విచారణ జరిపి సస్పెండ్ చేయాలని విచారణ అధికారి డాక్టర్ టీఎస్ దివాకర్‌ను సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ గుంతకల్లు డివిజన్ కార్యదర్శి బి. సురేష్ కోరారు. శనివారం విచారణ అధికారితో ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో ప్రత్యేక గదిని ఏర్పాటు చేసుకుని మహిళా సిబ్బందిని వేధింపులకు గురిచేస్తున్నాడన్నారు. తక్షణమే ఏఓను సస్పెండ్ చేసి క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు జిలాన్, సత్తార్, రామాంజినేయులు, నారాయియణ పాల్గొన్నారు. ఏఓపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పట్టణంలోని దళిత సంఘాల నాయకులు జగన్నాథ్, మహేంద్ర, రామాంజనేయులు, భీమలింగ వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఏఓ దిష్టిబొమ్మతో ధర్నా చేపట్టారు. అతడిపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు మారుతిప్రసాద్, సాకే నాగరాజు, కసాపురం రమేష్ వినతి పత్రం అందజేశారు. ఆ నలుగురు సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంజుల వెంకటేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు కేఎల్‌స్వామిదాస్ వినతి పత్రం అందజేశారు.

వివాదాస్పద ఏఓ పై విచారణ

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

గుంతకల్లు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వివాదాస్పదంగా మారిన పరిపాలనా అధికారి (ఏఓ) రాంప్రసాద్‌పై వైద్యాధికారి బృందం విచారణ చేపట్టింది. 'ఆస్పత్రికి మాయ రోగం' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ఈ నెల 27న ఏఓ రాంప్రసాద్ నిర్వాకంపై ఓ కథనం ప్రచురితమైన సంగతి విదితమే. దీనిపై స్పందించిన డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్ శుక్రవారం సాయంత్రం నలుగురితో కూడిన ఓ విచారణ సంఘాన్ని నియమించారు. ఈ మేరకు శనివారం ఉదయం మడకశిర ఆర్ఎంఓ డాక్టర్ టీఎస్ దివాకర్, మడకశిర ఆసుపత్రి సూపరింటెండెంట్ దొరస్వామి నాయక్, అనంతపురం డీసీహెచ్ఎస్ ఆఫీసు జేఓ బి. శివప్రసాద్ విచారణ నిమిత్తం గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఏఓపై ఫిర్యాదులు చేసిన వైద్యులు, పారిశుధ్య, సెక్యూరిటీ సిబ్బందిని ఒక్కొక్కరుగా పిలిచి వారి ఆరోపణలను రికార్డుచేశారు. మహిళా ఉద్యోగులు కూడా ఏఓ రాంప్రసాద్‌పై లైంగిక వేధింపులకు సంబంధించి ఫిర్యాదులు చేసినట్లు సమాచారం. విచారణాధికారులను కలసిన ప్రజా సంఘాల నాయకులు సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. సాయంత్రం వరకూ విచారణ జరిపిన అధికారులు తమ నివేదికను డీసీహెచ్ఎస్‌కు అందజేస్తామని తెలిపారు.



ఆసుపత్రిలో విచారిస్తున్న అధికారులు

భూవివాదాల పరిష్కారమే లక్ష్యం: విప్



ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

బొమ్మనహాళ్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం భూవివాదాలు లేని గ్రామాల్ని చూడడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం మండలంలోని గోనేహాళ్ గ్రామంలో తహసీల్దార్ మునివేలు అధ్యక్షతన రెవెన్యూ సదస్సుకు ప్రభుత్వ విప్, కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు, తుంగభద్ర ప్రాజెక్ట్ వైస్ ఛైర్మెన్ కేశవరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగన్‌రెడ్డి రైతులకు నరకయాతన చూపించారని అన్నారు. రీసర్వే పేరుతో జాయింట్ ఎల్‌పీ నెంబర్లు ఇచ్చి రైతులు పదెకరాలలో రెండు ఎకరాలు అమ్ముకోలేని విధంగా సమస్య తెచ్చి పెట్టారని తెలిపారు. మూడుసార్లు ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు ఏ రోజూ పట్టాదారుపాసుపుస్తకాలలో తన ఫొటోలను ముద్రించుకోలేదని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బలరాంరెడ్డి, మల్లికార్జున, జగన్నాథ్‌రెడ్డి, మల్లికార్జున, గోవిందు, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి

తాడిపత్రి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని సీపీఐ, సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎన్‌జీఓహోంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు రంగయ్య, జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాల్లో అమిత్‌షా అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలు దారుణం అన్నారు. సమావేశంలో నాయకులు నరసింహారెడ్డి, రాంమోహన్, కుళ్లాయప్ప, చంటి, ఉమాగౌడ్ పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా దేశ ప్రజలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని వామపక్ష పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో నాయకులు మాట్లాడుతూ ఈనెల 30న పట్టణంలో గాంధీ విగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, మారుతిప్రసాద్, గోపీనాథ్, ఎస్ఎండీ గౌస్, రామదాసు, రమేష్ నాగరాజు పాల్గొన్నారు.

బియ్యం గోడౌన్ వద్ద నిరసన



నిరసన తెలుపుతున్న జనసేన నాయకులు

తాడిపత్రి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని వప్పూరు రోడ్డులో ఉన్న రేషన్ బియ్యం గోడౌన్ వద్ద శనివారం జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కదిరి శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ బియ్యం తూకాల్లో అవకతవకలు జరుగుతున్నాయని సాక్ష్యాధారాలతో సహా పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించడం లేదన్నారు. గోడౌన్ ఇన్‌చార్జ్ శంకర్ చేతివాటంతో పేదలకు దక్కాల్సిన బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నాడని ఆరోపించారు. అధికారులను అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరసన కార్యక్రమంలో నాయకులు నరసింహాచారి, కొండ, రాజు పాల్గొన్నారు.

గోడౌన్ తనిఖీ

స్థానిక సివిల్‌సప్లై గోడౌన్‌లో అక్రమాలు జరుగుతున్నాయని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ కదిరి శ్రీకాంత్‌రెడ్డి సాక్ష్యాధారాలతో చూపించడంతో శనివారం జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రమేష్‌రెడ్డి గోడౌన్‌ను తనిఖీచేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్‌తోపాటు పలు రికార్డులను పరిశీలించారు. జిల్లా అధికారితో జనసేన నాయకులు కదిరి శ్రీకాంత్‌రెడ్డి వాగ్వాదం చేశారు. పలుమార్లు మీ దృష్టికి తీసుకువచ్చినా ఎందుకు స్పందించడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

కర్ణాటక మద్యం పట్టివేత

రాయదుర్గం రూరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాపురం గ్రామానికి చెందిన చౌడప్ప అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని 103 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ మహేష్‌కుమార్ తెలిపారు. శనివారం కర్ణాటక మద్యం రవాణాపై దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడులలో రాయదుర్గం మండలం మల్లాపురం గ్రామానికి చెందిన చౌడప్ప అనే వ్యక్తి అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తన మోటారు సైకిల్‌పై తీసుకెళుతుండగా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

రికార్డులను పరిశీలించి న్యాయం చేస్తాం: ఆర్డీఓ

(ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్ వర్క్)

విడపనకల్లు మండలం వేల్పుమడుగు రెవిన్యూ పొలం జనార్దనపల్లికి చెందిన దేవాలయ భూమి రికార్డులను పరిశీలించి గ్రామస్థులకు న్యాయం చేస్తామని ఆర్డీఓ శ్రీనివాసులు తెలిపారు. శనివారం వేల్పుమడుగు గ్రామంలో రెవిన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులు హాజరయ్యారు. జనార్దనపల్లికి చెందిన సర్వే నంబరు 141లోని 42.21 ఎకరాల భూమిలో కరూర్ గుండూరావుకు భూమి ఎలా వచ్చింది వివరాలు ఇవ్వాలని గ్రామస్థులు ఆర్డీఓను కోరారు. ఈ సందర్భంగా ఆర్డీఓ రెవిన్యూ అధికారులతో మాట్లాడుతూ పాత రికార్డులు పరిశీలించి ఈ భూమి ఎవరి పేరున ఉందో చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు సునితా బాయి, అధికారులు పాల్గొన్నారు. బ్రహ్మసముద్రం మండల పరిధిలోని భైరవాన్‌తిప్ప గ్రామ సర్పంచ్ మంజునాథ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుమతి, ఆర్ఐ నాగిరెడ్డి, వీఆర్వోలు, టీడీపీ మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు. బెళుగుప్ప మండలంలోని కోనంపల్లిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ షర్మిల, వీఆర్వో చంద్ర, సర్వేయర్లు పాల్గొన్నారు. శెట్టూరు మండలంలోని చింతర్లపల్లిలో నిర్వహించిన సదస్సులో తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టి వినతులు స్వీకరించారు. కూడేరులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో.. తమ భూముల్లోకి వెళ్లకుండా రస్తాలను అడ్డుకుంటున్నారని తక్షణమే పరిష్కరించాలని పలువురు రైతులు తహసీల్దార్ మహబూబ్ బాషకు వినతి పత్రం అందజేశారు. దారులు సక్రమంగా లేవని 21 అర్జీలను రైతులు వినతి పత్రాలు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, సర్వేయర్ ఆయేషా సిద్దిఖీ పాల్గొన్నారు. యాడికి మండలంలోని రాయలచెరువులో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజల నుంచి 8 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. సదస్సులో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, ఆర్ఐ కిష్టప్ప, సర్వేయర్ సుంకన్న పాల్గొన్నారు.



విడపనకల్లులో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు

ఎంపీడీఓపై దాడికి పలుచోట్ల నిరసన



రాయదుర్గంలో ఉద్యోగుల నిరసన

రాయదుర్గంరూరల్/యల్లనూరు/ పెద్దపప్పూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న గాలివీడు ఎంపీడీఓపై వైసీపీ నాయకులు దాడి చేయడంపై కఠినచర్యలు తీసుకోవాలని శనివారం పలుచోట్ల మండల పరిషత్ ఉద్యోగులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. రాయదుర్గంలోని మండల పరిషత్ కార్యాలయం ముందు ఎంపీడీఓ కొండన్న, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భం గా మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న ఎంపీడీఓపై దాడి చేయడం దారుణం అన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ మురళీకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ ఆజాద్‌రవి పాల్గొన్నారు. యల్లనూరు ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. ఎంపీడీఓ వాసుదేవరెడ్డి ఆధ్వర్యం లో సిబ్బంది కార్యాలయం ముందు నిల్చొని అధికారులకు భద్రత కల్పించాలని, దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. మండల ఇంజనీర్ నరేంద్ర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. పెద్దపప్పూరు ఎంపీడీఓ కార్యాలయ వద్ద ఎంపీడీఓ శకుంతల ఆధ్వర్యంలో సిబ్బంది నిరసన తెలిపారు. ఏపీఓ గంగరాజు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి రథోత్సవం



కపటలింగనహళ్లి, రాయంపల్లిలో రథోత్సవాల్లో భక్తులు

బ్రహ్మసముద్రం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కపటలింగనహళ్లిలో శనివారం ఆంజనేయస్వామి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా కార్తీక శనివారం ఆంజనేయస్వామి రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గ్రామస్థులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని పురవీధుల గుండా ఊరేగించారు. కార్యక్రమానికి టీడీపీ మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాయదుర్గంరూరల్ : మండలంలోని రాయంపల్లిలో ఆంజనేయస్వామి రథోత్సవాన్ని శనివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయాన్నే పంచామృతాభిషేకం, కుంకుమార్చన, పుష్పాలంకరణ, వస్త్రాలంకరణ తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం రథాన్ని పూలలతో అందంగా అలంకరించి స్వామివారిని రథంలో ప్రతిష్ఠించి ఊరేగించారు.

టీడీపీ శాశ్వత సభ్యత్వం



సభ్యత్వం తీసుకుంటున్న పురుషోత్తం

ఉరవకొండ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఏపీ ఐడీసీ మాజీ డైరెక్టర్, టీడీపీ సీనియర్ నాయకుడు దేవినేని పురుషోత్తం పార్టీ శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నారు. శనివారం పార్టీ సంక్షేమ నిధికి రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వం నమోదు చేసుకున్నారు. కార్యకర్తల సంక్షేమం కోసం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారన్నారు. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సహకారంతో నియోజకవర్గం అభివృద్ధి వైపునకు దూసుకెళ్తుందన్నారు.

పామిడి సర్వతోముఖాభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న గుమ్మనూరు ఈశ్వర్

పామిడి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల సర్వతోముఖాభివృద్ధే అజెండాగా కృషి చేద్దామని టీడీపీ మండల ఇన్‌చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం ఎన్డీఏ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పామిడి పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి పరచడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ప్రజల మౌళిక సదుపాయాలకు ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. ప్రతి కార్యకర్త సభ్యత్వం చేసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.3కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రామగిరి గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయం, విలేజ్ క్లీనిక్ ఆవరణంలో మొక్కలు నా టారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరెడ్డి, ప్రభాకర్‌చౌదరి, గౌస్‌పీరా, సంజీవకుమార్, ధనుంజయ, ముసలిరెడ్డి, కుమార్, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

బొమ్మనహాళ్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కళ్లదేవనహళ్లిలో శనివారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధమైంది. దీంతో ఇంట్లో ఉన్న టీవీ, బియ్యం, బీరువా, బట్టలు ఇతర సామగ్రి కాలిపోయాయి. దాదాపు రూ. 5 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు కృష్ణ తెలిపారు. తెల్లవారుజామున ఐదు గంటల ప్రాంతంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల గుడిసెకు నిప్పంటుకుంది. టీడీపీ నాయకులు సోమనాథ్‌గౌడ్ రూ. ఐదు వేల నగదు, నిత్యావసరాలు అందించారు.

ప్రయాణికురాలి నగదు, కమ్మల అపహరణ

గుత్తి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్‌లో బంగారు కమ్మలు, నగదు అపహరణకు గురయ్యాయని ఓ ప్రయాణికులు శనివారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెద్దవడూగురు మండలం మిడుతూరు గ్రామానికి చెందిన భూమిక గుంతకల్లు బస్సుకోసం వేచి ఉండగా బస్సు రాగానే ఎక్కి కూర్చుంది. బస్సు కదిలిన వెంటనే తన బ్యాగ్‌ను పరిశీలించగా రూ.9వేలు, నాలుగు గ్రాముల బంగారుకమ్మలు చోరీకి గురైనట్లు గుర్తించి వెంటనే బస్సు దిగి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ సురేష్ స్థానిక బస్టాండ్‌లో విచారణ చేపట్టారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

గుంతకల్లుటౌన్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, వసతి దీవెనను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయస్వామి డిమాండ్ చేశారు. పట్టణంలో పొట్టిశ్రీరాములు సర్కిల్‌లో శనివారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బెల్దారి సామగ్రితో కూలి పనులు చేసుకుంటూ వినూత్నంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు వంశీ, ఆంజనేయులు, వినోద్‌కుమార్, వెంకట్‌నాయక్, రోహిత్, శివమణి పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలే ధ్యేయం: ఆర్ఎం

ఉరవకొండ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు మెరుగైన సేవలందించడమే ఆర్టీసీ ధ్యేయమని రీజనల్ మేనేజర్ సుమంత్ ఆదోని పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోను శనివారం ఆయన తనిఖీ చేశారు. గ్యారేజీలోని సిబ్బంది, ఉద్యోగులతో మాట్లాడారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలించారు. ప్రయాణికుల కోసం కల్పిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ బాలాజీ దయాల్, పాల్గొన్నారు.

ఇసుక మేటల పరిశీలన

కణేకల్లు/బొమ్మనహాళ్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాలలో విస్తరించిన ఇసుకదిబ్బల ప్రాంతంలో అధికారుల బృందం శనివారం పర్యటించింది. వాటి నివారణ కోసం చేపట్టాల్సిన చర్యల గురించి ఈ బృందం అధ్యయనం చేస్తోంది. డ్వామా పీడీ సలీంబాషా, జేడీఏ ఉమామహేశ్వరమ్మ, హార్టికల్చర్ అధికారులు ఈ బృందంలో ఉన్నారు. తుంబిగనూరు, గరుడచేడు, బిదురకుంతం, దర్గాహోన్నూరు ప్రాంతాలలో వీరు పర్యటించారు. రైతులతో మాట్లాడి, వారి అభిప్రాయాలను తీసుకున్నారు. ఇక్కడి ఇసుకను తరలిస్తే వ్యవసాయం చేసుకునేందుకు భూములు అనువుగా ఉంటాయని రైతులు అధికారులకు వివరించారు. ఉద్యాన పంటల సాగుతో ఎడారీకరణ ఆగుతుందని అధికారులు రైతులతో అన్నారు. అనంతరం మాల్యం గ్రామం వద్ద సాగుచేసిన పప్పుశనగ పంటను జేడీఏ ఉమామహేశ్వరమ్మ పరిశీలించారు. రైతులు శరభనగౌడ్, విజయ్‌కుమార్‌గౌడ్ పొలాలలో పంట పరిస్థితిని తెలుసుకున్నారు. పంటకు వేరుకుళ్లు సోకిందని రైతులు తెలిపారు.